ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మెదక్

20
బుధవారం 2 ఆగస్టు 2017



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ శివదయాల్

ప్రజల్లో మార్పువచ్చినప్పుడే

జనాభా నియంత్రణ సాధ్యం

- కుటుంబ నియంత్రణ మగవారు కూడా చేసుకోవాలి
- ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవంలో కలెక్టర్ భారతి

4



తూప్రాన్ మండలంలో కొనసాగుతున్న టవర్ నిర్మాణ పనులు

అక్కడ అలా.. ఇక్కడే ఎందుకిలా?

- విద్యుత్ టవర్ల పరిహారం అంశం పట్టని జిల్లా అధికారులు
- సంగారెడ్డి జిల్లాలో మూడు నెలల క్రితమే ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్
- మంత్రి హరీశ్‌రావు ఆదేశించినా నేటికీ జిల్లాలో ఖరారు కాని పరిహారం
- రైతాంగాన్ని దగా చేస్తున్న కాంట్రాక్టర్లు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాతలు

5

విద్యుత్ టవర్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న అన్నదాతలు తీవ్రంగా మోసపోతున్నారు. నిబంధనలకు పాతరేస్తూ అరకొర పరిహారమిచ్చి కాంట్రాక్టర్లు దగా చేస్తున్నారు. రైతులు కోల్పోతున్న భూములకు పరిహారం ఖరారు చేసి ఉత్తర్వులివ్వాలని సాక్షాత్తూ మంత్రి హరీశ్‌రావు ఆదేశించినా జిల్లా అధికారుల చెవికెక్కడం లేదు. పొరుగున ఉన్న జిల్లా అధికారులు వీటిపై మూడు నెలల క్రితమే ఉత్తర్వులిచ్చినా జిల్లా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జరిగిన అన్యాయంపై బాధిత రైతులు పోరాటానికి సిద్ధమవుతున్నారు.

మెదక్ మున్సిపాలిటీ యాప్



మొబైల్‌లో

మున్సిపల్ సేవలు

- ఇక పన్నులూ మొబైల్ యాప్ ద్వారా చెల్లించొచ్చు
- చెత్త పేరుకుపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, కాల్వల్లో మురుగు నీరు నిండిపోవడం, రోడ్లను శుభ్రపరచడం లాంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం

5 లో

డబ్బులిప్పించండి సారూ..



తహసీల్దార్‌కు డీడీలు, బ్యాంకు పాస్‌పుస్తకాలు చూపిస్తున్న లబ్ధిదారులు

- డీడీలలో ఇంటిపేరు తప్పుగా ఉందని ఇబ్బంది పెడుతున్న బ్యాంకు అధికారులు
- తహసీల్దార్‌తో మొర పెట్టుకుంటున్న నష్టపరిహార బాధితులు

3



చెరువులో బయటపడిన మృతదేహాలు

విషాదం నింపిన

ఈత సరదా

- శోకసంద్రంలో కాళ్లకల్
- పెద్దచెరువులో బయట పడిన మృతదేహాలు
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం

3

హైదరాబాద్‌కు లిఖిత్‌రెడ్డి

- యశోద, నిమ్స్ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు
- రెండు, మూడురోజులపాటు మరిన్ని టెస్ట్‌లు
- త్వరలో నిమ్స్‌లోనే గుండెమార్పిడి శస్త్రచికిత్స



నిమ్స్‌లో లిఖిత్‌రెడ్డి

చేర్యాల : గుండె, శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు బోకూరి లిఖిత్‌రెడ్డిని ఉన్నత వైద్యపరీక్షల నిమిత్తం అధికారులు మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. 'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో చిన్నారికి ప్రభుత్వ ఖర్చులతో గుండె మార్పిడి ఆపరేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డిని సీఎం కేసీఆర్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొమురవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చెందిన ఆస్పత్రి సిబ్బంది.. ఆంబులెన్సులో ఉదయాన్నే గ్రామానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు బోకూరి బాల్‌రెడ్డి, లావణ్యతో లిఖిత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యపరీక్షల నిర్వహణ విషయమై సంబంధిత వైద్యుడితో పాటు రెవెన్యూ అధికారిని మంగళవారం కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వైద్యశాఖ ఉన్నతాధికారులు, ఆస్పత్రుల వైద్యులతో మాట్లాడారు. గంట గంటకు లిఖిత్ రెడ్డి వైద్యపరీక్షలపై ఆయన ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్యురాలు స్వప్నిక సమక్షంలో యశోద ఆస్పత్రి వర్గాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు లిఖిత్‌రెడ్డికి వైద్యపరీక్షలు జరిపారు. అనంతరం వైద్యశాఖ, ఉన్నతాధికారుల సూచన మేరకు నిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్య నిపుణులతో మాట్లాడి ఇతర వైద్యపరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రెండు మూడు రోజులపాటు వైద్య పరీక్షలు జరిపిన క్రమంలో శనివారం అనస్తీషియా వైద్యనిపుణులు బాలుడిని పరీక్షించనున్నారు. ఫలితాలకు అనుగుణంగా మంగళవారం వైద్యనిపుణుల బృందం సమావేశమై గుండె మార్పిడి ఆపరేషన్ విషయాన్ని నిర్ధారించనున్నారు.



కొమురవెల్లి పీహెచ్‌సీ అంబులెన్సులో హైదరాబాద్‌కు వెళుతున్న లిఖిత్‌రెడ్డి, తల్లిదండ్రులు



పందిరిసాగు విధానంలో లింగారెడ్డి చేపట్టిన తీగజాతి కూరగాయలు



బొప్పాయి తోట



బీరకాయల్ని సంచుల్లో నింపుతున్న కూలీలు

సేద్యం

మెలకువలతో సాగు..

లాభాలు బాగు

- తైవాన్ బొప్పాయి, పందిరిసాగు పద్ధతిలో కూరగాయలను పండిస్తూ మంచి రాబడులు సాధిస్తున్న రైతు
- ఆదర్శంగా నిలుస్తున్న అన్నదాత నలుసాని లింగారెడ్డి
- ప్రభుత్వం నుంచి చేయూత అంతంత మాత్రమే

మద్దూరు : చిన్నసన్నకారు రైతులు తక్కువ వ్యవసాయ భూమిలోనే సాధ్యమైనంత మేర ఎక్కువ దిగుబడి సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా ఉద్యాన పంట అయిన బొప్పాయితో పాటు కొన్ని కూరగాయాలను పందిరి సాగు విధానంలో పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. అలాంటి వారి మార్గంలోనే వెళ్తున్నారు మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన రైతు నలుసాని లింగారెడ్డి. 3 ఎకరాల్లో బొప్పాయి, మరో 3 ఎకరాల్లో పందిరిసాగు విధానంతో కూరగాయల సాగు ఆయన చేపట్టారు. మేలైన యాజమాన్య పద్ధతులననుసరించి అధిక లాభాలు అర్జిస్తున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా ఈ విధానం నేడు రైతులకు ఆర్థికంగా సత్ఫలితాలను అందిస్తోంది. నాణ్యమైన పంట ఉత్పత్తులతో పాటు అధిక దిగుబడుల్లోనూ గణనీయమైన వృద్ధి కన్పిస్తుండటంతో ఉద్యానశాఖ శాశ్వత పందిర్ల పథకం కింద రైతులకు రాయితీలు అందిస్తోంది. ఎకరాకు రూ. 2 లక్షలు పందిరిసాగుకు ఖర్చవుతోంది. 50 శాతం ఖర్చు ఉద్యాన శాఖ అందజేస్తుంది. గరిష్టంగా 2.5 ఎకరాలకు సబ్సిడీ పొందే వీలుంది.

తైవాన్ సాగుతో మంచి లాభాలు

బొప్పాయి సాగు.. రైతులకు లాభాల పంట పండిస్తుంది. మేలైన యాజమాన్యం పాటించిన తోటల్లో రైతుకు ఎకరాకు 40 నుంచి 50 టన్నుల దిగుబడి వస్తుంది. ఇతర పండ్ల తోటల కన్నా బొప్పాయి సాగులో మెరుగైన రాబడి వస్తోంది. తైవాన్ రకాల రాకతో సాగు రూపురేఖలు మారిపోయాయి. ఈ రకానికి దేశీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బొప్పాయి సాగులో 90 శాతం ఈ తైవాన్ రకం ఆక్రమించింది. ఇక రైతు లింగారెడ్డి ముందుగా 3 ఎకరాలకు సరిపడా తైవాన్ బొప్పాయి సీడ్ తెచ్చుకున్నారు. సొంతంగా నర్సరీ ఏర్పాటు చేసుకుని అందులో మొక్కల్ని పెంచారు. 45 రోజుల తర్వాత సిద్ధం చేసుకున్న భూమిలో ఎకరాకు 1024 మొక్కల చొప్పున 3 ఎకరాల్లో నాటారు. తోట సాగుకు డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మొక్కలకు కావాల్సిన ఎరువుల్ని డ్రిప్ పద్ధతుల ద్వారా అందిస్తూ వైరస్ తెగుళ్ల సోకకుండా పలు జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఎకరానికి రూ. 2 లక్షల ఆదాయం అందివస్తుండటంతో పాటు రూ. 35 వేల నుంచి రూ. 40 వేల సాగు ఖర్చు వస్తుందన్నారు. ప్రతి 15 రోజులకు కోత అందివస్తుండటంతో హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

పందిరిసాగుతో అధిక దిగుబడులు

పాదుజాతి కూరగాయలు నేలమీద సాగుచేస్తే గాలి వెలుతురు సోకక చీడపీడల బెడద ఎక్కువై దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. వర్షాలు అధికంగా ఉన్న సందర్భాల్లో పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుంది. కానీ పందిరిసాగు విధానంతో ఆ సమస్యలుండవు. మొక్కలు ఆరోగ్యమైన పెరుగుదలతో పాటు దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. కాగా లింగారెడ్డి 3 ఎకరాల్లో పందిరిసాగు చేపట్టి తీగజాతి బీర, కాకరవంటి కూరగాయలు పండిస్తున్నాడు. పందిరిసాగు విధానంలో కూలీల కొరతతో పాటు డ్రిప్ పద్ధతి, మల్చింగ్ విధానంతో కలుపు లేకుండా ఉంటుందని ఆయన చెబుతున్నాడు. వారవారం కూరగాయల్ని కోసి దగ్గర్లోని మార్కెట్‌కు తరలిస్తూ హోల్‌సేల్‌గా మారు వ్యాపారులకు కిలోకు రూ. 30 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ ఎరువుల్ని సమర్థంగా వాడుకునే వీలుంటుందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటల్ని సాగుచేసుకోవచ్చంటున్నారు. ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణలు చేపడితే చాలా కాలం పంట దిగుబడులు పొందవచ్చంటున్నాడు లింగారెడ్డి.

సబ్సిడీ కోసం దరఖాస్తు చేసినా అందలేదు



వరంగల్ జిల్లాలో ఉన్నప్పుడు ఉద్యానశాఖకు పందిరిసాగుకు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నా. అయితే జిల్లాలు మారడంతో సిద్దిపేట జిల్లాలోకి మద్దూరు మండలం చేరిది. ఇక్కమళ్లీ ఉద్యానశాఖ అధికారుల జాడ తెల్సుకుని దరఖాస్తు చేశా. వరంగల్ జిల్లా నుంచి అక్కడ సబ్సిడీ తీసుకోనట్టుగా నో డ్యూ సర్టిఫికెట్ తెమ్మన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా లబ్ధి చేకూరలేదు. పందిరి విధానంతో సాగు చేపట్టే రైతులకు అధికారులు సబ్సిడీ అందజేస్తే మరింత మంది ఈ సాగు చేపట్టడానికి ముందుకు వస్తారు. ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నా అధికారులు కనికరించకపోవడం బాధాకరం.

– లింగారెడ్డి, రైతు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమిస్తాం

ఉద్యోగపర్వం

- పాండు, పౌర సరఫరాల హమాలీ సంఘం నాయకుడు



నారాయణఖేడ్ : పౌర సరఫరాల హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమిస్తాం. కొన్ని దశాబ్దాలుగా పౌర సరఫరాల శాఖలో హమాలీ కార్మికులుగా చాలామంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పని చేసిన మేరకే హమాలీ ఇస్తున్నారు. అలా కాకుండా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతి నెలా వేతనం ఇవ్వాలి. ప్రజాపంపిణీ పథకాన్ని ఆహార భద్రతా చట్టంగా అమలు చేయాలి. ప్రస్తుతం చౌక ధరల దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. అలా కాకుండా 14 రకాల నిత్యావసరాలను సరఫరా చేయాలి. ప్రభుత్వం ప్రస్తుతం అవలంబిస్తున్న విధానాలతో హమాలీలు వీధిన పడే పరిస్థితి నెలకొంది. అందువల్ల ఉద్యోగులుగా గుర్తించడమే కాకుండా రూ.10 వేల బోనస్ ఏటా ఇవ్వడమే కాకుండా 50 సంవత్సరాలు వయస్సు పైబడిన వారికి ప్రతి నెల రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలి. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి.

ఆలయంలో దర్శనమయ్యాక కూర్చొని లేస్తేనే ఫలితం

- గురుజ్యోషి, పురోహితుడు



భక్తి

నారాయణఖేడ్: ఆలయంలో దేవుడిని దర్శించుకున్నాక తీర్థ ప్రసాదాలు స్వీకరించి శఠగోపాన్ని తలపై పెట్టించుకున్న అనంతరం ఆలయం ఆవరణలో కొద్దిసేపు కూర్చొవాలి. ఇలా చేస్తేనే దేవాలయానికి వచ్చిన ఫలితం దక్కుతుంది. ఆలయంలో భగవంతున్ని ప్రశాంతత , పుణ్యం కోసం దర్శించుకుంటాం. దర్శనం తరువాత కొద్ది సేపు ఆలయంలో ప్రశాంతతో కూర్చొని దేవుడిని స్మరించుకోవాలి. అప్పుడే మనం చేసే పనుల్లో తప్పుఒప్పుల గురించి ఆలోచించగల్గుతాం. దీంతో సరియైన మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగుతాం. అందువల్ల దేవాలయంలో దేవుడిని దర్శించుకున్నాక ఒకట్రెండు నిమిషాలు కళ్లుమూసుకొని దేవుడిని తలచుకుంటే చేస్తే మంచి ప్రయోజనాలు కలుగుతాయి.



ఉరేసుకొని కార్మికుడి మృతి

చేగుంట: స్నానం చేయడానికి చెరువుకు వెళ్లిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన పొలంపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం రాయచోట గ్రామానికి చెందిన హనూష్ (25) మండల కేంద్రమైన చేగుంటలోని రైల్వే స్లీపర్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో పొలంపల్లి చెరువులో స్నానం చేయడానికి వెళ్తున్నట్లు తోటి కార్మికులతో చెప్పి వెళ్లగా సాయంత్రం వేళ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు స్థానికులు సమాచారం అందించారు. ఏఎస్ ఐ రాంచందర్‌నాయక్ సంఘటనా స్థలికి వెళ్లి శవాన్ని చెట్టుపై నుంచి దించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు తెలిపారు.


మృతి చెందిన హనూష్

నీటి బకెట్లో పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి సిరి

మెదక్ క్రైం: ప్రమాదవశాత్తు ఓ చిన్నారి నీటి బకెట్లో పడి మృతి చెందిన సంఘటన మెదక్ పట్టణంలోని నవాబ్‌పేటలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నవాబ్‌పేటకుచెందిన మ్యాకల వెంకటేశ్‌లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుర్లు. కాగా చిన్న కూతురు సిరి (2) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోని బాత్‌రూంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు తెలిపారు. అయితే బాత్‌రూంలో నీటితో నిండుగా ఉన్న బకెట్లో ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరాడకా మృతి చెందిందని తెలిపారు. చిన్నారి ఎంత సేపటికి కన బడకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకగా బాత్‌రూంలోని బకెట్లో చిన్నారి విగతజీవిగా కనపడినట్లు పేర్కొన్నారు. చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రెడ్డీస్ ల్యాబ్‌లో కొమురవెల్లివాసి దుర్మరణం

- గాయపడి చికిత్స పొందుతూ మృతి


మహేశ్ (పాతఫొటో), మృతదేహం

జిన్నారం/చేర్యాల: బొల్లారంలోని ప్రముఖ ఫార్మా కంపెనీ రెడ్డీస్ యూనిట్-3 ల్యాబ్‌లో సోమవారం రాత్రి గ్యాస్ రియాక్టర్ పేలి సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలానికి చెందిన సార్ల మహేశ్(20) గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జిన్నారం సీఐ సతీష్ రెడ్డి తెలిపారు. కొమురవెల్లికి చెందిన సార్ల శ్యామల-మల్లయ్య రెండో కుమారుడైన మహేశ్ ఏడాది న్నర క్రితం రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగంలో చేరాడు. రోజు వారీ లాగే సోమవారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ల్యాబ్ లోని గ్యాస్ రియాక్టర్ పేలింది. గాయా లపాలైన ముగ్గురిని ఆసుపత్రిలో చేర్చగా మహేశ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలిసిన మహేశ్ కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లారు. యాజమా న్యంతో మాట్లాడి పోస్టుమార్టం నిర్వహింపచేసిన అనంత రం మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా, ప్రమాదంలో గాయపడ్డ మరో కార్మికుడు వెంకటరమణ చికిత్స పొందుతుండగా, శ్రీనాథ్ అనే కార్మికుడు డిశ్చార్జి అయినట్లు జిన్నారం సీఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

ఈత సరదా.. రెండు కుటుంబాల్లో విషాదం

- చెరువులో పడి అన్నదమ్ములు మృతి
- కాళ్లకల్‌లో ఘటన

మనోహరాబాద్ (తూప్రాన్): విద్యార్థులు కనిపించకుండా పోయిన సంఘటన విషదంతో ముగిసింది. ఒకే వయస్సు.. అందులోనూ వరసకు అన్నదమ్ములు.. కళాశాలకు సెలవులు కావడంతో తల్లిదండ్రులను చూడడానికి వెళుతున్న అన్నతో చిన్నాన ఊరికి వచ్చాడు. చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోయారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన నిజామాబాద్‌లోని గౌతమ్‌నగర్‌కు చెందిన అన్వర్ షరీఫ్, ఉస్మాన్‌షరీఫ్ అన్నదమ్ములు. వీరికి ఇద్దరు కుమారులు. అక్బర్ షరీఫ్(16), నుమాన్ షరీష్(16). ఇద్దరూ నిజామాబాద్‌లోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మెదక్ జిల్లా కాళ్లకల్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో అన్వర్ షరీఫ్ పనిచేస్తు కుటుంబంతో ఇక్కడే ఉంటున్నాడు. కళాశాలకు సెలవులు కావడంతో తల్లిదండ్రులను అక్బర్ షరీఫ్ చూడడానికి బయలు దేరాడు. ఇతని వెంట ఉస్మాన్‌షరీఫ్ కుమారుడు నుమాన్‌షరీష్ కూడా బయలుదేరాడు. ఊరికి వచ్చిన వీరు సోమవారం గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఒకరు చెరవులోకి జారిపడ్డారు. రక్షించే ప్రయత్నంలో మరోకరు చెరువులోకి పడిపోయారు. సాయంత్రం వరకు అన్నదమ్ములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. చెరువు వద్ద అక్బర్ షరీఫ్, నుమాన్ షరీష్ దుస్తులు కనిపించడంతో గాలింపు చేపట్టారు. అప్పటికే రాత్రి పడడంతో ఇళ్లకు వెళ్లారు. రాత్రంతా పిల్లలు ఇంటికి రాకపోవడంతో కంటిమీద కునుకు లేకుండా దేవున్ని ప్రార్థించారు. పిల్లలు సురక్షితంగా ఇంటికి రావాలని వేడుకున్నారు. కానీ ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం గాలింపు చేపట్టగా అన్నదమ్ముల మృతదేహాలు ఒకే చోట లభించాయి. దీంతో బాధిత కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. మనోహరాబాద్ ఎస్ఐ వరప్రసాద్ ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను గజ్వేల్ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతి చెందిన అక్బర్‌షరీఫ్, నుమాన్ షరీఫ్


చెరువు వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

ఏడుపాయల్లో గుర్తుతెలియని శవం లభ్యం

యాచకుడిగా అనుమానం


గుర్తుతెలియని మృతదేహం

పాపన్నపేట: ఏడుపాయల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ నర్సింలు కథనం మేరకు.. ఏడుపాయల్లోని ఆలయ సన్నిధి ప్రాంతంలో నీటి మడుగులో గుర్తు తెలియని శవం తేలియాడుతున్న విషయం ఆల య సిబ్బంది గుర్తించింది. గజ ఈతగాళ్లతో నీటిలో ఉన్న శవాన్ని ఒడ్డుకు తీయించారు. మృతుడు యాచకుడిగా అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని ఎడ మ భుజంపై నాగుపాము పచ్చబొట్టు, కుడి చేతి భుజంపై శంకరుడి పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

చేగుంట: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు శిక్ష జరిమానాను విధిస్తూ మెదక్ స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని చేగుంట ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. తొగుటకు చెందిన కత్తిరెడ్డి సిద్దిరాంరెడ్డికి 3 రోజుల జైలు శిక్ష, ఒక వెయ్యి జరిమానా, కరీనంగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష, ఒక వెయ్యి రూపాయల జరిమానాను విధిస్తూ మెదక్ స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ తీర్పు ఇచ్చారని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పరిహారం డీడీలు
చెల్లుబాటయ్యేలా చూడండి సారూ..



ప్రభుత్వం పంపిణీ చేసిన పరిహారం చెక్కు, పాస్‌బుక్కులో లబ్ధిదారు పేరు

చిన్నశంకరంపేట: వర్షానికి కూలిన ఇళ్ల నష్టపరిహారం డీడీలు చెల్లటం లేదు. డబ్బులు ఇప్పించండి సారూ.. ఉంటూ లబ్ధిదారులు తహశీల్దార్‌తో మొరపెట్టుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాల యంలో కొర్విపల్లి, చందంపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారుడు డీడీలలో ఇంటిపేరు తప్పుగా ఉంటే బ్యాంకు వారు మీది కాదంటూ వెళ్లిపొమ్మంటున్నారని తెలిపారు. ఎలాగైనా ఆ డబ్బు ఖాతాల్లో జమ అయ్యేయ్యేలా చూడాలని తహశీల్దార్ సహదేవ్‌ను కోరారు. గత సెప్టెంబర్‌లో కురిసిన వర్షానికి కూలిన ఇళ్లను గుర్తించి నష్టపరిహారం డీడీల రూపంలో చెల్లించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన డీడీలు గత ఆరు నెలల క్రితం లబ్ధిదారులకు అందించారు. ఇంటిపేరో లేక లబ్ధిదారుడి పేరో తప్పుగా ఉండడంతో తహశీల్దార్ సిబ్బంది వారి పేర్లు తప్పుగా ప్రింటైంది వాస్తవమే.. లబ్ధిదారులు ఒకరేనని ధ్రువీకరించిన పత్రం అందించినప్పటికీ బ్యాంకు వారు డీడీలు ఖాతాల్లో జమ కావనడడంతో దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుపడ్డాడన్న చందంగా తమ పరిస్థితి నెలకొందంటూ వాపోయారు. సుమారు 30 మంది ఇదే సమస్యతో బ్యాంకు, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డీడీలు చెల్లుబాటయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఒకే అక్షరం తప్పుంది: నాగలక్ష్మి, లబ్ధిదారు

పాస్‌బుక్కులు, డీడీలో ఒకే అక్షరం తప్పుంది. బ్యాంకు ఖాతాల్లో ఇంటిపేరు భూందారిని డీవోవో ఉంటూ డీడీలో డీయూఎం అని ఉండడంతో బ్యాంకు వారు ఒప్పుకోవడం లేదు. ఎలాగైనా నష్టపరి హారాన్ని అందించాలి.

బ్యాంకులో ఒకేసారి పేరు మార్పు

బ్యాంకు ఖాతా పుస్తకంలో పేరు మార్పు ఒకేసారి జరుగుతుంది. పేరు మార్పు డీడీ చెల్లించే విధంగా చొరవ తీసుకుంటే మరోసారి ఖాతాదారుడికి సమస్యగా మారుతుంది. డీడీలందించిన బ్యాంకు వారు మాత్రమే డీడీలో పేరు సరిచేస్తే భవిష్యత్‌లో ఖాతాదారుడికి సమస్య ఉండదు.

- అన్నపూర్ణ , ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

● జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి



సలీంపాషాను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

మెదక్ అర్బన్: ఒత్తిడిని తట్టుకొని బాధ్యతలు నిర్వహించిన రోజునే మంచి ఉద్యోగిగా చిరకాలం గుర్తుండిపోతారని జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో జిల్లా మైనార్టీ అధికారి సలీంపాష పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి పదవిలో ఉన్నప్పుడు ఒత్తిడికి గురికాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన కూడా అవసరమైనప్పుడు సేవలను అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా అధికారులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురేష్‌బాబు, డీఆర్‌డీవో సీతారామారావు, ఆర్డీవో మెంచు నగేష్, వివిధ సంక్షేమ శాఖ అధికారులు కోటాజి, వసంత, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏబీవీపీ ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

మెదక్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తియినా విద్యారంగం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రోజురోజుకూ ప్రభుత్వం విద్యను అంధకారంలోకి నెట్టుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను పటిష్ట పరచకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమానులకు దాసోహమై విద్యా వ్యాపారానికి తెర లేపిందన్నారు. ప్రభుత్వం పాఠశాల భవనాలు నిర్మించకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం, కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించకపోవడం వంటి సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న 400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో మెంచు నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పృథ్వీ, శ్రీనివాస్‌గౌడ్, ప్రణీత్, పౌల్, శ్రీకాంత్, నవీన్, హరి, రాజేశ్వర్, వినయ్‌గౌడ్, సతీష్, ధను పాల్గొన్నారు.

సమ్మెబాటలో హమాలీలు

మెదక్ అర్బన్: రెక్కాడితే గాని.. డొక్కాడని దయనీయమైన స్థితిలో చౌకధరల దుకాణాలకు సరఫరా అయ్యే సరుకులను మోస్తూ శ్రమదోపిడీకి గురవుతున్న హమాలీలు తమ ఉద్యోగ భద్రత కోసం 7 రోజులుగా సమ్మెబాట పట్టారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యతో పాటు రేషన్ డీలర్లు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం హమాలీలకు మద్దతు తెలిపారు. దీంతో ప్రజలకు రేషన్ కష్టాలు రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ సివిల్ సప్లయి కార్పొరేషన్ పరిధిలో జిల్లాలో 7 మండలాల్లో పాయింట్లు ఉన్నాయి. మెదక్, రామాయంపేట, చేగుంట, తూప్రాన్, నర్సాపూర్, పాపన్నపేట, పెద్దశంకరంపేట ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. చౌకధర దుకాణాలు ఎత్తివేస్తే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం సోమవారం సివిల్ సప్లయి కమిషనర్‌తో చర్చలు కొనసాగుతున్నాయి. చర్చలు సఫలమవుతే నేటి నుంచి విధుల్లో వస్తామని లేకుంటే సమ్మెను యథావిధిగా కొనసాగిస్తామని హమాలీలు పేర్కొంటున్నారు.

ప్రజల్లో మార్పువచ్చినప్పుడే

జనాభా నియంత్రణ సాధ్యం

- కుటుంబ నియంత్రణ మగవారు కూడా చేసుకోవాలి
- జనాభా దినోత్సవంలో జిల్లా కలెక్టర్ భారతిహోళికేరి



ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

మెదక్ రూరల్: ప్రజల్లో అవగాహన, మార్పు వచ్చినప్పుడే జనాభా నియంత్రణ సాధ్యమౌతుందని జిల్లా కలెక్టర్ భారతిహోళికేరి పేర్కొన్నారు. మంగళారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే చైనా తర్వాత అధిక జనాభా కలిగి ఉన్న దేశం మనదేనన్నారు. జనాభా అధికంగా ఉండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. నియంత్రణ కోసం హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఆయా దేశాల్లో జనాభా విపరీతంగా పెరగడం వల్ల భూమికి, పర్యావరణానికి హాని జరుగుతుందని ఐక్యరాజ్య సమితి భావించి ప్రతీ సంవత్సరం జనాభా నియంత్రణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మహిళలు మాత్రమే చేసుకోవాలనే భావన సమాజంలో పాకిపోయిందని, దీనిపై పురుషులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పురుషులు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పురుషులు ఆపరేషన్ చేసుకుంటే వారం రోజుల లోప సాధారణ స్థితికి వస్తారని, కానీ మహిళలు సాధారణ స్థితికి రావడానికి చాలారోజులు సమయం పడుతుందన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మగవారు కూడా చేయించుకునేలా అవగాహన కల్పించాలని వైద్యశాఖకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హచ్‌వో వెంకటేశ్వర్‌రావు, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, ఆర్డీవో నగేష్, డీసీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవార్డులు ప్రదానం

ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని పది మంది వైద్యశాఖ సిబ్బందికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ఉత్తమ పీహెచ్‌సీలుగా కౌడిపల్లి, శివ్వంపేట, ఉత్తమ మెడికల్ అధికారిగా డాక్టర్ శివదయాల్(మెదక్), డా.అమ్రిత (రంగంపేట), ఉత్తమ సర్జన్ లుగా డా.అరుణశ్రీ, డా.శ్రీశంకర్, ఉత్తమ స్టాఫ్ నర్సులుగా సువర్ణ(రేగోడ్), మైత్రేయి(రెడ్డిపల్లి), ఉత్తమ ఎంపీహెచ్‌ఏలుగా వెంకట రాంబాయి(కూచన్‌పల్లి), సరళ (కొప్పులపల్లి), ఉత్తమ ఎంపీహెచ్‌ఏ (పురుషులు)గా వెంకటేశ్వర్లు (పెద్దశంకరంపేట), శ్రీనివాస్(సర్దన), ఉత్తమ సీడీపీవోగా జ్యోతిర్మయి(రామాయంపేట), హేమ సత్య(మెదక్), ఉత్తమ అంగన్‌వాడి కార్యకర్తగా సవిత(జక్కపల్లి), సలీంబి(రుద్రారం), ఉత్తమ ఆశావర్కర్‌గా మంజుల(కొత్వాన్‌పల్లి), వినోద (అన్నారం), లక్కీడ్రిప్ ద్వారా చిన్నారి నిర్మల, శోభలు ఎంపికయ్యారు. అలాగే ఎస్సే కాంపిటేషన్ ద్వారా పదిమంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని

సిబ్బందిని క్రమబద్ధీకరించే వరకు

సమ్మె కొనసాగిస్తాం

- తెలంగాణ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ వర్కర్స్ అసోసియేషన్ (ఎస్పీఎం)

తూప్రాన్: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలంగాణ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ వర్కర్స్ అసోసియేషన్ (ఎస్పీఎం) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ వెంకన్న, మెదక్ జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మింట్ కాంఫౌండ్ ముట్టడించిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించిన నేపథ్యంలో తమను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం నుంచి విధిలేని పరిస్థితిలో సమ్మెకు వెళ్లామన్నారు. మింట్‌కాంపౌండ్ ముట్టడి చేపట్టి సీఎండీ రఘుమారెడ్డి, చైర్మన్ ప్రభాకర్‌రావులకు డిమాండ్లను వినతి చేశామన్నారు. ఏ ఒక్క డిమాండ్‌ను నెరవేర్చకుంటే సమ్మెను విరమించే ప్రసక్తి లేదన్నారు. క్రమబద్ధీకరణ చేసే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. 20-30 ఏళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు సెంటర్లలో పనిచేసే కార్మికులు పనిచేయకుండా ప్రభుత్వం ప్రకటించిన 24 గంటల విద్యుత్‌ను ఏలా అందిస్తారని వారు ప్రశ్నించారు. స్వచ్ఛమైన హామీ వచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని, రాష్ట్రం అందకారంలోకి వెళుతుందని వారు హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం క్రమబద్ధీకరించనున్న 24వేల పోస్టుల్లో తమను తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ లేదన్న సాకుతో క్రమబద్ధీకరణ చేయకపోవడంతో బాధకరమన్నారు. రాష్ట్ర వ్యాస్తంగా 197 ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు సెంటర్ షెడ్స్ మూతపడ్డాయన్నారు. మెదక్ జిల్లాలో 5 షెడ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేస్తున్నట్లు వారు వివరించారు. మెదక్ జిల్లా అధ్యక్షుడిగా తూప్రాన్‌కు చెందిన యశ్వంత్‌రెడ్డి అధ్యక్షులుగా, నర్సాపూర్‌కు చెందిన ఆపీజ్‌ను కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న పేర్కొన్నారు.



మింట్‌కాంపౌండ్‌లో సీఎండీ కార్యాలయం ముట్టడి

సీపీఎస్ విధానం రద్దుకు సీఎంకు పోస్టు కార్డులు



పోస్టుకార్డుల ప్రదర్శన

తూప్రాన్: కంట్రిబూషనరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు పోస్టుకార్డులు పంపిస్తున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మెదక్ జిల్లా అధ్యక్షుడు బి. ముత్యాలు పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ బాలికల పాఠశాలలో జరిగిన మండల సమావేశానికి హాజరై, జిల్లాకార్యదర్శి బి. రాజేంద్రప్రసాద్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేస్తు పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. పాత జోన్‌లలోనే ప్రమోషన్లు, బదిలీలు జరగాలన్నారు. పండిత్, పీఈటీ పోస్టులను ఆఫ్‌గ్రేడ్ చేసిని పదోన్నతులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ఇందులో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల బాధ్యులు లక్ష్మన్, మురళీ, రమేష్, రాధ, మమత, మెహర్‌వాణి, రాజ్‌కుమార్, కళ్యాణి, రేణుకదేవి, సుహాసిని, మాలతి, సౌజన్య, అరుణలు పాల్గొన్నారు.

అక్కడ అలా.. ఇక్కడే ఎందుకిలా?

- విద్యుత్ టవర్ల పరిహారం అంశం పట్టని జిల్లా అధికారులు
- సంగారెడ్డి జిల్లాలో మూడు నెలల క్రితమే ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- మంత్రి హరీశ్‌రావు ఆదేశించినా నేటికీ జిల్లాలో ఖరారు కాని పరిహారం
- రైతాంగాన్ని దగా చేస్తున్న కాంట్రాక్టర్లు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాతలు

ఆంధ్రజ్యోతి, మెదక్: విద్యుత్ టవర్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న అన్నదాతలు తీవ్రంగా మోసపోతున్నారు. నిబంధనలకు పాతరేస్తూ కాంట్రాక్టర్లు అరకొరగా పరిహారం ఇచ్చి కాంట్రాక్టర్లు దగా చేస్తున్నారు. కోల్పోతున్న భూములకు పరిహారం ఖరారు చేసి ఉత్తర్వులు ఇవ్వాలని సాక్షాత్తూ మంత్రి ఆదేశించినా జిల్లా అధికారుల చెవికెక్కడం లేదు. పొరుగున ఉన్న జిల్లా అధికారులు వీటిపై మూడు నెలల క్రితమే ఉత్తర్వులు ఇచ్చినా జిల్లా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుం డటం విమర్శలకు తావిస్తోంది. వారికి జరిగిన అన్యాయంపై బాధిత రైతులు పోరాటానికి సిద్ధం అవుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

విద్యుత్ సరఫరా కోసం డిచ్‌పల్లి నుంచి కంది వరకు 400 కేవీ, 765 కేవీ లైన్లు వేస్తున్నారు. 400 కేవీ విద్యుత్ లైన్ జిల్లాలోని పాపన్నపేట, కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల మీదుగా, 765 కేవీ విద్యుత్‌లైన్ రామాయంపేట, వెల్దుర్తి, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల మీదుగా వేస్తున్నారు. ఇప్పటికే చాలా మండలాల్లో పనులు పూర్తి కావస్తున్నాయి. రైతులకు మాత్రం న్యాయమైన పరిహారం అందడంలేదు. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అధికారులు, కాంట్రాక్టర్లు గాలికొదిలేస్తున్నారు. ఏర్పాటు చేస్తున్నవి భారీ టవర్లు అయినందున తీగల కింద, టవర్ పక్కన వ్యవసాయ, ఇతర పనులు చేయడానికి వీలు లేదు. టవర్ నిర్మాణం చేసే ప్రాంతంతో పాటు ఒక టవర్ నుంచి మరో టవర్‌కు వేసే లైన్ల మేర ఆ రైతు భూమిని కోల్పోతున్నారు. పరిహారం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలున్నా కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కుతూ రైతులను మోసం చేస్తున్నారు. అడిగిన వారికి ఒక విధంగా అడగని వారికి మరో విధంగా ఓ లెక్కంటూ లేకుండా పరిహారం ఇస్తూ పనులు చేస్తున్నారు. చిలప్‌చెడ్, కౌడిపల్లి, పాపన్నపేట మండలాల్లో మరీ తక్కువగా పరిహారం ఇచ్చారు. రూ.20నుంచి రూ.80 వేల వరకు ఇచ్చారు. ఇందులో ఎక్కువ మందికి రూ.50 వేల లోపు మాత్రమే పరిహారం అందజేశారు. వెల్దుర్తి, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల్లో ఒక్కో టవరు ఏర్పాటుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. తీసుకుంటే ఈ మేర డబ్బు లైనా చేతికొస్తాయి.. లేకపోతే పరిహారం ఇవ్వకుండానే పనులు చేసుకుంటూ, ఎవరికైనా చెప్పుకోండి' అంటూ కాంట్రాక్టర్లు అన్నదాతలను బెదిరింపులకు గురిచేస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో భూములనిచ్చేందుకు అంగీకరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాతో పోల్చితే మెదక్ జిల్లా రైతులకు మరీ తక్కువగా పరిహారం అందుతోంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం నర్సాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా తుక్కాపూర్ వరకు 400కేవీ విద్యుత్‌లైన్ నిర్మిస్తున్నారు. తూప్రాన్, శివ్వంపేట, వెల్దుర్తి మండలాల మీదుగా టవర్ల ఏర్పాట్లు చేస్తున్నారు. తూప్రాన్ మండలంలో రైతుల భూముల్లో ఏర్పాటు చేసిన టవర్లకు ఇప్పటి వరకు రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదు. కనీసం తమకు సమాచారం కూడా లేకుండానే పొలాల్లో పనులు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో ఉత్తర్వులు..
ఇక్కడ ఆ ఊసే లేదు

భారీ విద్యుత్ లైన్ల కారణంగా పెద్దఎత్తున రైతులు భూములు కోల్పోతున్నారు. ఎంత లేదన్నా 350 చదరపు గజాల విస్తీర్ణంలో వీటిని నిర్మిస్తున్నారు. భూమి నష్టపోతున్న రైతుల వినతులతో సంగారెడ్డి జిల్లా అధికారులు స్పందించారు. ఏ భూమికి ఎంత పరిహారం చెల్లించాలో తెలుపుతూ గత ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. కాని ఆ ఉత్తర్వులను కూడా కాంట్రాక్టర్లు పట్టించుకున్న దాఖలాలు లేవు. మెదక్ జిల్లా అధికారులు ఆ మాత్రం చొరవను ప్రదర్శించలేకపోతున్నారు. దీనిపై మంత్రి ఆదేశాలను కూడా వారు పట్టించుకోవడం లేదు. గత నెల 24న సంగారెడ్డిలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో విద్యుత్ లైన్ల కారణంగా భూములు కోల్పోతున్న వారికి ఏ విధమైన పరిహారం ఇవ్వాలో ఖరారు చేసి ఉత్తర్వులు ఇవ్వాలని మంత్రిహరీశ్‌రావు కలెక్టర్ భారతిహోళికేరిని ఆదేశించారు. భూముల ధరలను బట్టి పరిహారం ఖరారు చేయాలని చెప్పారు. మంత్రి ఆదేశించి వారం రోజులయినా ఇప్పటికీ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేయకపోవడం గమనార్హం.

కొల్చారంలో జడ్పీటీసీ చొరవతో కాస్త మెరుగు

మిగతా మండలాలతో పోలిస్తే కొల్చారం మండలంలోని రైతులకు మాత్రం కాస్త మెరుగైన పరిహారం దక్కింది. స్థానిక జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి చొరవతో ఇది సాధ్యమైంది. ఇతర గ్రామాల్లో లాగే ఇక్కడ కూడా తక్కువ పరిహారం ఇచ్చి పనులు చేయాలని కాంట్రాక్టర్ అనుకున్నప్పటికీ భూమి కోల్పోతున్న రైతులు, జడ్పీటీసీ పనులను అడ్డుకున్నారు. పరిహారం పెంచితేనే పనులు సాగనిస్తామని పట్టుబట్టడంతో కాంట్రాక్టర్ తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్కో టవర్‌కు రూ.1.20 నుంచి రూ.1.50 లక్షల వరకు చెల్లించారు. మిగతా చోట్ల కనీసం లక్ష కూడా ఇచ్చిన పాపాన పోలేదు.

పరిహారం ఇవ్వాల్సిందిలా..

విద్యుత్‌లైన్ కోసం టవర్ ఏర్పాటు చేస్తే సంబంధిత రైతుకు కనిష్టంగా రూ.2.45 లక్షల నుంచి గరిష్టంగా రూ.4.5 లక్షల వరకు పరిహారం ఇవ్వాలి. గ్రామాల్లో, రోడ్లకు దగ్గరగా ఉన్న వాటికి ఎంత మేర చెల్లించాలో మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి. టవర్ నిర్మించే స్థలానికి పరిహారంతో పాటు పంట నష్టపోయినందుకు అదనంగా చెల్లించాలి. వ్యవసాయశాఖ అధికారులు అంచనా మేరకు పంట నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. విద్యుత్ లైన్ల కింద ఉన్న పొలాలకు ఒక టవర్ నుంచి మరో టవర్ వరకు 20 మీటర్ల వెడల్పుతో ప్రతి చ.మీ కు రూ.60 చొప్పున రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎక్కడా అమలవుతున్న పరిస్థితి లేదు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఇది మాకు సంబంధించిన విషయం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. టవర్ ఏర్పాటుతో సదరు భూమి విలువ భారీగా పడిపోతుంది. కనీసం న్యాయమైన పరిహారం అందిస్తే కాస్త ఉపశమనంగా ఉంటుంది. అధికారులు మాత్రం కాంట్రాక్టర్లకు మేలు జరిగే విధంగా చేస్తుండటంతో రైతులు మండిపడుతున్నారు. దీనిపై రైతులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆందోళన చేశారు. బుధవారం మెదక్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు సమాయత్తమవుతున్నారు.


శివ్వంపేట మండలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
– కృష్ణ, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు



భారీ విద్యుత్ టవర్లతో మెదక్, సంగారెడ్డి జిల్లాలో రైతులు భూములను నష్టపోతున్నారు. వారికి సరైన పరిహార మివ్వకుండా కాంట్రాక్టర్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వ హించి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారు
– చందా నారాయణ, రైతు, తూప్రాన్



పట్టాభూమిలో టవరు నిర్మిస్తున్నారు. వాళ్లు నోటీసు ఇస్తామంటే నేను తీసుకోలేదు. మీరు వద్దన్నా ఊర్కోమంటున్నారు. భూమికి పరిహారం ఇవ్వరంటా.. పంట పరిహారం ఇస్తారంటా.

మొబైల్‌లో మున్సిపల్ సేవలు

- ఇక పన్నులూ మొబైల్ యాప్ ద్వారా చెల్లించొచ్చు
- చెత్త పేరుకుపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, కాల్వల్లో మురుగు నీరు నిండిపోవడం, రోడ్లను శుభ్రపరచడం లాంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం

మెదక్: ఇన్నాళ్లూ పట్టణ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం మున్సి పాలిటీ చుట్టూ కాళ్లరిగేలా తిరగడం, అధికారులకు వినతులు సమర్పించడం.. కౌన్సిలర్లతో పైరవీలు.. అయినా సమస్య అలాగే ఉండిపోయేది. ఇక ఇప్పుడు మున్సిపల్ అధికారులు 'వెబ్‌సైట్' ప్రారంభించారు. ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఇన్‌చార్జి కమిషనర్ చిరంజీవి తెలిపారు. చెత్తా పేరుకుపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, కాల్వల్లో మురుగు నీరు నిండిపోవడం, రోడ్లు శుభ్రపరచడం వంటి సమస్యలకు పరిష్కారం మొబైల్ యాప్ ద్వారా లభిస్తుంది. సమస్యను నమోదు చేయగానే వెంటనే ఫిర్యాదుదారుడికి ఆర్జీ సంఖ్య ఇవ్వబడుతుంది. దాంతో పాటు సంబంధిత అధికారికి ఫిర్యాదుదారుడి సమస్య, మొబైల్ నంబర్ ఎస్ఎంఎస్ ద్వారా అందుతుంది. అదే సమయంలో ఫిర్యాదుదారు డికి సంబంధిత అధికారి వివరాలు మొబైల్ నంబర్ అందుతుంది. దీంతో పాటు వారిచ్చిన ఫిర్యాదు ఏ స్థితిలో ఉందనే విషయం కూడా ఫిర్యాదు దారుడు మొబైల్‌లో చూసుకోవచ్చు. సమస్య పరి ష్కరించబడగానే ఫిర్యాదు దారుడికి సందేశం అందుతుంది. ఇదంతా మున్సిపాలిటీకి వెళ్లనవసరం లేకుండా ఫిర్యాదులను పరిష్కరించుకోవచ్చు.



మెదక్ మున్సిపాలిటీ యాప్

పన్నుల చెల్లింపులు మొబైల్ ద్వారానే

ఇంటి పన్ను, నీటి పన్ను కూడా మొబైల్ యాప్ ద్వారానే చెల్లించుకునే వెసులుబాటును మెదక్ మున్సిపల్ అధికారులు కల్పించారు. డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డులను ఉపయోగించి మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చు. మెదక్ మున్సిపాలిటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఏ చోట నుంచైనా పన్నులు చెల్లించవచ్చు. ఇక ఏదైనా ధ్రువపత్రం కోసం సమర్పించిన దరఖాస్తు ఏ స్థితిలో ఉంది, ఏ అధికారి వద్ద ఉంది, ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు.? లాంటి సమాచారం కూడా వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. ఇదే కాకుండా పట్టణ ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన వార్డు కౌన్సిలర్ల ఫొటో వివరాలు, అధికారుల వివరాలు, మున్సిపాలిటీ అందించే పలు సేవలు, ధ్రువపత్రాలు, రుసుముల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మున్సిపల్ సిబ్బంది వివరాలు, ఫోన్ నంబర్లు, సేవలకు సంబంధించిన దరఖాస్తు పత్రాల వివరాలు తెలుసుకోవచ్చు. మున్సిపల్ అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు అందించవచ్చు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఈ యాప్ ను పొందాలనుకునే వారు గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మున్సిపాలిటీ మెదక్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇన్‌చార్జి కమిషనర్ తెలిపారు.

'అక్షరం' కథనం ఆసక్తికరం

గ్రామ చావిడి వద్ద ఆసక్తిగా వార్తను చదివిన గ్రామస్థులు


ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తను చదువుతున్న గ్రామస్థులు

వెల్దుర్తి: మెదక్ జిల్లా ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన 'కాంప్లెక్స్@ కబ్జా' అనే కథనం మంగళవారం వెల్దుర్తి మండల కేంద్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. వెల్దుర్తి నుంచి మెదక్‌కు వెళ్లే రహదారి పక్కన ఓ వ్యాపారి ప్రభుత్వ పొనాది భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడనే కథనం రావడంతో విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పెద్దలు, యువకులు ఒక్కసారిగా 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధాన్ని చూసి పత్రిక రాసిన కథనం అక్షర సత్యమని కితాబిచ్చారు. వెల్దుర్తిలోని పలు కూడళ్ల వద్ద వార్తను చదువుతూ అన్యాయాలపై నిర్భయంగా రాసేది ఆంధ్రజ్యోతే అని అభినందనలు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాల్‌రావు, సంజీవాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ తెలిపారు. పత్రిక ఎప్పుడూ దమ్మున్న వార్తలే రాస్తుందని, 'మీ అక్షరం మా ఆయుధం'గా మరెన్నో అవినీతిపై కథనాలను ప్రచురించి ప్రజలకు బాసటగా ఉండాలని వారు తెలిపారు.

సినిమాలు

మెదక్		పెద్దశంకరంపేట		తూప్రాన్	
సినీమ్యాక్స్	ఫిదా	లక్ష్మి	బాహుబలి-2	వేంకటేశ్వర	గౌతమ్‌నంద
గంగినేని	గౌతమ్‌నంద	**నర్సాపూర్**		**రామాయంపేట**	
సాగర్	వాసుకి	సాయి	ఫిదా	సంతోష్	గౌతమ్‌నంద
		శ్రీనివాస	గౌతమ్‌నంద	సాయిరామ్	ఫిదా

కుక్కలు, పందుల స్వైర విహారం

- జనావాసాల మధ్యే తిరుగాడుతూ బైకులకు అడ్డొస్తూ ప్రమాదాలకు ఊతం
- చిన్నపిల్లలను కరుస్తున్న వైనం



పందుల గుంపు, కుక్కల స్వైరవిహారం

రామాయంపేట: పట్టణంలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దరిమిలా జనాలపై దాడులకు తెగబడుతున్నాయి. పిల్లలను కరుస్తూ భయభ్రాంతులకు లోనుచేస్తున్నాయి. ఇటీవల కాలంలో వీధుల వెంట గుంపులుగా తిరుగుతూ బైకులకు అడ్డవస్తూ ప్రమాదాలు తెచ్చిపెడ్తున్నాయి. రెండు మాసాలకిందట నాగరాజు అనే వ్యాపారి బైకుకు పందుల గుంపు అడ్డు రాగా తీవ్ర గాయాలై నగరంలోని ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లాల్సి వచ్చింది. మరెందరో బైకులపై వెళ్తూ ప్రమాదాల బారినపడ్డారు. అదేవిధంగా మూడురోజుల కిందట స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఓ పిచ్చికుక్క ఆరుగురిని కరవగా.. కాలనీవాసులు వెంటాడి చంపేశారు. గతేడాది ఓ బాలున్ని కుక్క కరిచిన ఘటనలో ఏకంగా ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చింది. విచ్చలవిడిగా జనావాసాల మధ్యే తిరుగాడుతూ పిల్లల తల్లితండ్రులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామపంచాయతీవారు ఇదివరకే పందులు ఊరి నుంచి తొలగించాలంటూ నిర్వాహకులకు నోటీసులిచ్చినా ఫలితం శూన్యం. అంతేకాదు ప్రభుత్వ స్థలంలో పెంచుకోవాలని వారికి స్థలం కేటాయించినా పట్టించుకోవట్లేదని అధికారులు చెబుతున్నారు. కాగా కుక్కలను కొన్నింటిని ఇటీవల చంపివేసినా.. బాగానే తిరుగాడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే మరికొన్నింటిని చంపనున్నామన్నారు. ఏమైనా కుక్కలు, పందులు విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నపిల్లలు రోడ్లవెంట నడవాలంటేనే భయమేస్తోందని ప్రజలు ఆందోళన వెలిబుచ్చారు. వీటిని తొలగించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

'పిల్లలకు ముర్రిపాలు పట్టించాలి'

టేక్మాల్: గర్భిణులు, బాలింతలకు పౌష్ఠికాహారం అందిస్తున్నామని టేక్మాల్‌లోని అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త ప్రేమలత అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం టేక్మాల్ బస్టాండ్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పుట్టిన పిల్లలకు ముర్రిపాలు పట్టించాలని సూచించారు. బలంగా పెరిగేందుకు అవసరమైన పౌష్ఠికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలు సగమే!

- పేరుకు లక్ష అన్నారు... ఉన్నవి 50 వేల లోపే!


మొలకెత్తని మొక్కలను తొలగించిన దృశ్యం

రేగోడు : హరితహారం లక్ష్యం ఆదిలోనే నిలిచిపోతోంది. ఉపాధిహామీ పథకంకింద రేగోడుమండలంలో రెండు లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. మండలంలోని కొత్వాన్‌పల్లి, బురన్‌వాడి తండాల్లో నర్సరీలు రావడంతో సగం మొక్కలే నర్సరీలలో పెరిగాయి. హరితహారంలో టేకు మొక్కలు రైతులకు అందకుండాపోయాయి. నర్సరీలలో మొలకెత్తని మొక్కల బ్యాగ్‌లను తొలగింపజేశారు. లక్షల మొక్కలు అన్నారు. నర్సరీలలో మొక్కలే లేవని రైతులు అంటున్నారు. ఈ విషయమై ఉపాది సిబ్బందిని ప్రశ్నిస్తే నర్సరీలలో పెరిగిన మొక్కలను హరితహారంలో నాటించామని అవసరమైతే తెప్పిస్తామని అన్నారు.

హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలి

- ఎంపీడీవో హరిసింగ్


మొక్కను నాటుతున్న ఎంపీడీవో హరిసింగ్

పెద్దశంకరంపేట: హరితహారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములై ఎక్కువగా మొక్కలను నాటాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో హరిసింగ్ అన్నారు. మంగళవారం పేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలనూ నాటాలని, వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో సైతం, ఖాళీ ప్రదేశాలలో ఎక్కువసంఖ్యలో మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సారక్ష భారతీ మండల కోఆర్డినేటర్ లక్ష్మన్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రఘురాం, అనిల్‌రెడ్డి, తుకారం, ఏపీవో మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ గుంతలను పూడ్చరూ!

రేగోడు : రోడ్డుపై గుంతలు, సైడ్ మొరం లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రేగోడు మండలంలోని మర్పల్లి, పోచారం గ్రామాలమధ్య వేస్తున్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. పక్క కంకర వేసి వదిలేయగా మరో పక్కమొరం రోడ్డు ఉంది. ఇటివలే కురిసిన చిన్న వర్షానికే మొరం కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు వర్షం నీటి కాలువలుగా మారి వాహనాలు పడిపోతున్నాయి. రోడ్డునిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టి గుంతలను పూడ్చివేయాలని వాహన దారులు ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా సైడ్ రోడ్డు

సిద్ధివినాయకుడికి వెండి కిరీటాలంకరణ

మెదక్: స్థానిక సత్యసాయి మందిర ప్రాంగణంలో సిద్ధిబుద్ధి వినాయకుడికి మంగళవారం భక్తుడు మేడిశెట్టి చంద్రయ్య ఒక కిలో 16 తులాలతో తయారు చేసిన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా పంచామృతాలతో వినాయకుడికి చంద్రయ్య, స్వరూపరాణి దంపతులు అభిషేకం చేశారు. ఈ కార్యక్ర మంలో సత్యసాయి సంస్థల జోనల్ చైర్మన్ శ్రీ వాండ్ల సాయిబాబ, సమితి కన్వీనర్, కోకన్వీనర్ వెంకట్‌గౌడ్, మునిగాల శ్రీరాం, సంపత్, శంకర్, అరవింద్, భాగలక్ష్మి, నవీన్, మంగ శంకర్, రుక్మిణి, నాగరాణి, గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


వెండి కిరీటాలంకరణతో సిద్ధివినాయకుడు

డబుల్‌బెడ్‌రూం గృహాల కోసం దరఖాస్తులు

పెద్దశంకరంపేట : డబుల్‌బెడ్‌రూం గృహాల కోసం మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు పేట తహసీల్దార్‌కు మంగళవారం దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం చివరిరోజు అని అర్హులైన లబ్ధిదారులు వెంటనే దబుల్ బెడ్‌రూం గృహాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

రేగోడులో తాగునీటి సమస్య

రేగోడు: మండలకేంద్రం రేగోడులో తాగునీటి సమస్య నెలకొంది. రేగోడు తోపాటు మర్పల్లి, ప్యారారం, పోచారం గ్రామాలకు ఎన్‌ఏపీ బోరంచ ద్వారా నీరు సరఫరా అవుతుంది. మూడురోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌ఏపీ పైపులు లీకేజీలు, మోటార్లు కాలిపోవడంతో సమస్య వస్తోందని ఎన్‌ఏపీ సిబ్బంది అంటున్నారు. రేగోడుతో పాటు కస్తూర్బా పాఠశాలకు ఉన్నత పాఠశాలలకు ఎన్‌ఏపీ బోరంచ నీరు వాడుతారు. నీటి సరఫరా లేక తాగునీటి సమస్య ఏర్పడిందని అంటున్నారు. ఎన్‌ఏపీ బోరంచ నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయరహదారిపై గోతులు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు


గొయ్యిలోంచి వెళ్తున్న కారు

అల్లాదుర్గం : అల్లాదుర్గం మండలంలోని 161వ జాతీయ రహదారిపై ఏర్పడిన గోతులతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని చిల్వర్ గ్రామ శివారులో ఏర్పడిన గోతితో వాహన చోదకులు ఇబ్బందులకు గురవటంతో స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని పక్షం రోజులక్రితం శ్రమదానం చేసి తాత్కాలిక మరమ్మతు పనులను చేపట్టారు. ఈ రహదారిపై నిత్యం వీఐపీలు ప్రయాణిస్తుంటారని, సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి ఈ గోతులకు మరామ్మతు పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

చెడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- అంధకారంలో గడిపెద్దాపూర్


చెడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అల్లాదుర్గం : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో గ్రామం అంధకారంగా మారిందని అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామ సర్పంచ్ సురేఖ చెన్నకృష్ణాగౌడ్ తెలిపారు. ఆమె మంగళవారం విలెకరులతో మాట్లాడుతూ, గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి మూడు రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, దీంతో విద్యుత్ సమస్యతో గ్రామం అంధకారంగా మారిందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినా పెడచెవిన పెట్టారని ఆమె ఆరోపించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లేశం, దాసు, బాబు

హవేళీఘణపూర్: ఆగస్టు 9వ తేదీన నిర్వహించే చలో పార్లమెంటుకార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె. మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హవేళీ ఘణపూర్‌లో చలో పార్లమెంటు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పటిష్టంగా అమలుచేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అటవీ హక్కుల చట్టంప్రకారం భూమి సాగు చేసుకుంటున్న రైతులకు భూహక్కు పత్రాలు ఇవ్వాలని, దళిత గిరిజనులకు మూడెకరాలు సాగుభూమి ఇవ్వాలని, అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని, దళిత గిరిజన, మైనారీటిలపై జరిగే దాడులను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. దాసు, ఎన్. దాసు, మల్లేశం, బాబు పాల్గొన్నారు.

బాచారం పాఠశాలకు గ్రహచారం

● నాలుగు సంవత్సరాలుగా అసంపూర్తి దశలోనే నూతన భవనం
● శిథిలావస్థకు చేరిన పాత భవనాలు
● కూలిన ప్రహరీ, వంట గదులు లేక ఆరుబయటనే వంటలు





అసంపూర్తి దశలోనే ఉన్న పాఠశాల భవనం, కూలిన పాఠశాల ప్రహరీ, వంట చేస్తున్న దృశ్యం

పాపన్నపేట: ప్రాథమికవిద్యకు మౌలిక వసతులు దూరమవుతున్నాయి. గ్రామీణస్థాయి విద్యార్థుల వసతుల కల్పనకు ఏటా కోట్ల రూపాయలు ప్రభుత్వం వెచ్చిస్తున్నా.. విద్యార్థులకు ఆ ప్రతిఫలాలు అందడం లేదు. పాపన్నపేట మండలంలోని బాచారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఇందులోకి వస్తుందనే సందేహం లేదు. సుమారు ఎప్పుడో ఐదు సంవత్సరాల క్రితం నూతన పాఠశాల భవనానికి పునాది పడ్డా నేటికీ అసంపూర్తి దశలోనే పాఠశాల భవనం దర్శనమిస్తోంది. పాత భవనాలు బీటలువారి, కిటికీ రెక్కలు ఊడిపోయి ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి ఉపాధ్యాయులను, విద్యార్థులను భయపెడుతున్నాయి. చినుకుపడితే చాలు పాఠశాల ఆవరణమంతా బురదమయంగా తయారవుతున్నాయి. నేటికీ పాఠశాలకు వంటగది లేక ఆరుబయటనే వంటలు వండుతున్నారు. వంటచేసే సమయంలో వర్షంవస్తే ఉడికీ ఉడకని అన్నంతోపాటు కూర విద్యార్థులకు పరమాన్నంగా మారుతోంది. ఎప్పుడో నిర్మించిన పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. ప్లాట్‌ఫాం లేకపోవడంతో తాగునీటి నల్లాల వద్ద దుర్గంధం నెలకొంటోంది. అరకొర వసతులున్న పాఠశాలలో చదువులు కూడా విద్యార్థులకు అరకొరగానే అందుతున్నాయి. వర్షం పడ్డ రోజు నిలుచుండి బోధన అందించడానికి వీలు లేకుండా గదులదుస్థితి, పాఠశాల ఆవరణ బురదమయంగా మారుతున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉపాధ్యాయుల పరిస్థితే ఇలా ఉంటే చిన్నపిల్లలైన విద్యార్థులు పడే బాధలు వర్ణనాతీతం. పాపన్నపేట మండల ఎంపీపీ గ్రామంలోని పాఠశాల పరిస్థితి ఇలా ఉంటే మిగతా పాఠశాలల మాటేమిటంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంలో కూడా పాఠశాలల దుస్థితి అధ్వానంగా ఉండడంపై సర్వత్రా విమర్శలు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం స్పందించి కనీస మౌలిక వసతులకు దూరమైన బాచారం పాఠశాలకు పట్టిన గాచారాన్ని వదిలిస్తారని ఆశిద్దాం.

నిధులు లేకనే అసంపూర్తిదశలో భవనాలు

: గ్రామ సర్పంచ్ వెంకట్‌రాములు

అసంపూర్తి దశలో ఉన్న పాఠశాల భవనాలను పూర్తిస్థాయి మరమ్మతులకు నిధులు రావడం లేదని గ్రామసర్పంచ్ వెంకట్‌రాములు 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు. ఐదేళ్లక్రితం భవన నిర్మాణాలకు పునాది పడ్డా అది పూర్తి కాకపోవడానికి నిధుల కొరతనే అన్నారు. గ్రామస్థుల సహకారంతో ఊరుబయట పాఠశాల భవనానికి ఐదెకరాల అనువైన స్థలాన్ని సేకరించి పెట్టామన్నారు. భవనాల నిర్మాణం కోసం ఎన్నోసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

రేపటి నుంచి డబుల్‌బెడ్‌రూం కోసం దరఖాస్తు చేసుకోవాలి

● తహసీల్దార్ యాదగిరి



యాదగిరి

మెదక్ అర్బన్: మెదక్ పట్టణంతో పాటు పాతూర్, రాజ్‌పల్లి గ్రామాల ప్రజలు రెండు పడకల గదులను ప్రభుత్వ మంజూరు చేసినందున అర్హులైన వారి జాబితాను తయారు చేయడానికి అర్హులైనవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ తహసీల్దార్ యాదగిరి తెలిపారు. అర్హులైనవారి నుంచి 3నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తు చేయడానిరి ఈ కింది సూచనలను ఆయన తెలియజేశారు.ఎలాంటి సొంత ఇల్లు, సొంత ఇంటి స్థలం లేని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు కుటుంబ దారిద్రరేఖకు దిగువై ఉండాలి. దరఖాస్తు చేసుకునేవారు అదే గ్రామ స్థిర నివాసులై ఉండాలి. వేరే గ్రామం నుంచి వలస వచ్చి నివసిస్తున్న వారు అర్హులు కారు. దరఖాస్తు చేసుకునేవారు అడ్రస్, కులం, వయసు, ఫోన్ నెంబర్, వార్డునెంబర్, గ్రామంపేరు,. పూర్తివివరాలు రాయాలి. దర ఖాస్తుతో పాటు ఫొటో, ఆధార్, రేషన్, ఓటర్ కార్డు జిరాక్స్‌ను జత చేయాలి. మెదక్, పాతూర్, రాజ్‌పల్లి వారివారి ఊర్లలో అధికారులకు సమర్పించాలి.

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట: డబుల్‌బెడ్‌రూంకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సహదేవ్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నశంకరంపేట, రుద్రారం గ్రామస్థులు అర్హులైనవారు బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

● సగర సంఘానికి దరఖాస్తులివ్వాలి
● జిల్లా కన్వీనర్ మర్కుదత్తు

రామాయంపేట: విద్యార్హతతో నిమిత్తం లేకుండా ఉత్తములుగా నిలిచిన విద్యార్థులకు సగర సంఘం నగదు పురస్కారాలు అందించనున్నట్లు ఆ సంఘంజిల్లా కన్వీనర్ మర్కుదత్తు పేర్కొన్నారు. మంగళవారం నాడాయన రామాయంపేటలో మాట్లాడుతూ 20న రవీంద్రభారతిలో వీటిని సగర క్షత్రియ వెల్ఫేర్‌ట్రస్ట్ ఈ బహుమతులను ఇవ్వనుందన్నారు. 2016-17లో విద్యారంగంలోనే కాదు క్రీడారంగంలోనూ రాష్ట్ర, జాతీయస్థాయిలో నిలిచినవారికి వీటిని అందిస్తారన్నారు. అందువల్ల ఉత్తమ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. విద్యార్థులు హాజరు కాకపోయినా తల్లితండ్రులకు ఈ బహుమతులు ఇవ్వబడ్తాయన్నారు.

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

● జిల్లా అధ్యక్షుడు జయరాం

చిన్నశంకరంపేట: పద్మశాలీలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పద్మశాలిసంఘం జిల్లాఅధ్యక్షుడు మ్యాకల జయరాం అన్నారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడ్డ పద్మశాలీ కుటుంబాలు జీవనం కోసం వలసలు వెళ్తున్నారన్నారు. కులవృత్తుల వారికి చేయూతనిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పద్మశాలీలకు షరతులు లేని బ్యాంకు రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. అలాగే 15న చేగుంటలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో వివాహ పరిచయ వేదిక జరగనున్నట్లు తెలిపారు. 10వ తేదీలోపు యువతీ, యువకుల సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిల్‌కుమార్, కంది శ్రీరాములు, డాక్టర్ సత్యనారాయణ, బిక్షపతి, కుమ్మర రాజయ్య, అరునార్తి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అమానుషం

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

మెదక్ రూరల్: అధికార పార్టీ దళితులపై దాడులు చేయడం అమానుషమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ దళితులను టార్గెట్‌గా చేసి దాడులు చేయడం దారుణమన్నారు. నేరెళ్ల ఘటన ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్రంలో దళితులపై దాడులు చేసిన ప్రభుత్వం స్పందించలేదని, ఏకంగా అధికార పార్టీనేతలే దళితులపై దాడులకు పూనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్ల దళితులపై దాడులు చేసి బహిష్కరిస్తే రాష్ట్రమంత్రి కేటీఆర్ ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ప్రభుత్వతీరుకు అద్దం పడుతుందన్నారు. నేరెళ్ల ఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాజకీయ స్వార్థం కోసం బలిచేయొద్దు

● క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అడ్డుకోవడం దారుణం
● విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



మెదక్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

మెదక్ రూరల్: రాజకీయ స్వార్థం కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్(1104) యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగు లను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందుకు నిరసనగా మంగళవారం మెదక్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న 21వేల మందిని ప్రభుత్వం రెగ్యులర్ చేస్తే కొంతమంది స్వార్థపరులు రాజకీయ దురుద్దేశంతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల వల్ల రాజకీయంగా నష్టపోతామన్న దురుద్దేశంతో కోర్టులో రద్దు పిటిషన్ వేశారని ఆరోపించారు. కోర్టులో పిటిషన్ వేసినవారు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వేణు, ప్రేమ్‌సాగర్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, విఠల్, ప్రసాద్, గౌసొద్దిన్, సాయివిఠల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో రైల్వే టెర్మినల్ ఏర్పాటుపై హర్షం

మెదక్ అర్బన్: నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రం మెదక్‌లో నిర్మించబోయే రైల్వే స్టేషన్‌ను టెర్మినల్‌గా ఏర్పాటు చేయడంపై రైల్వే సాధన సమితి సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమ వారం హైదరాబాద్‌లో దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌కు మెదక్ రైల్వే సాధన సమితి అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్, సభ్యు లు గోలి కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అంద జేసి కృతజ్ఞతలు తెలిపారు.



రైల్వే జీఎం వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్నరైల్వే సాధన సమితి బాధ్యులు

డిటెన్షన్ విధానం మానుకోవాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బస్వరాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ రూరల్: ప్రాథమిక ఉన్నత విద్యలో డిటెన్షన్ విధానాన్ని తీసుకు వచ్చి విద్యార్థులను విద్యకు దూరం చేసే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బస్వరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5, 8 తరగతులలో, డిగ్రీ, బీఎడ్‌లలో కొనసాగుతున్న డిటెన్షన్ విధానం తీసుకు రావడం మూలంగా విద్యార్థుల డ్రాప్‌ఔట్స్ పెరిగే ప్రమాదముందన్నారు. ఇప్పటికే పేదలకు విద్య అందని ద్రాక్షగా మారుతుందని, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంఖ్యకు అనుగుణంగా బోధకులు లేకపోవడం మూలంగాప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందడం లేదని ఆరోపించారు. సమస్యలతో సాగుతున్న ప్రభుత్వ విద్యాలయాల్లో డిటెన్షన్ విధానం వల్ల గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు.

'ఎంఈవో నరేష్ సస్పెన్షన్ ఎత్తివేయాలి'

మెదక్ రూరల్: మెదక్ మండల విద్యాధికారి నరేష్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీసీ సంక్షేమసంఘం జిల్లాఅధ్యక్షుడు బీమరి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంఈవో నరేష్ సస్పెన్షన్ దారుణమన్నారు. అగ్రవర్ణాలకు చెందిన ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరుకాకుంటే ఎంఈవోను సస్పెన్షన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయనను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

'వేతనాల జీవోను విడుదల చేయాలి'

శివ్వంపేట: ఆశ వర్కర్లకు పెంచిన వేతనాల జీవోను వెంటనే విడుదల చేయాలని శివ్వంపేట ఆరోగ్య మెడికల్ ఆఫీసర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఆశ వర్కర్లు మాట్లాడుతూ 2006నుంచి పని చేస్తున్న ఆశ వర్కర్లు గతంలో 106 రోజులు సమ్మె చేయడం జరిగిందన్నారు. ఫలితంగా ఏప్రిల్ నుంచి వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు జీవోను విడుదల చేయలేదన్నారు. వెంటనే ఆశ వర్కర్ల వేతనాల జీవోతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు రేణుక, గోపమ్మ, మాధవి, వెంకటలక్ష్మి, నిర్మల, నాగమణి తదితరులు ఉన్నారు.

శివ్వంపేట ఆరోగ్య కేంద్రానికి ఉత్తమ సేవ అవార్డు

శివ్వంపేట: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉత్తమ సేవ అవార్డుకు ఎన్నికైంది. మెదక్‌లో మంగళవారం కలెక్టర్ భారతీహొళికేరి చేతుల మీదుగా డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రమేశ్, శివ్వంపేట డాక్టర్ స్వర్ణలత అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట ఎంపీహెచ్‌వో దిగంబర్, ఆరోగ్య మిత్ర శ్రీనివాస్, ప్రభు, నర్సింలు, సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ రాలేదని ఆందోళన

శివ్వంపేట: మండలంలోని నవాబుపేటకు చెందిన పెన్షన్‌దారులకు గత ఏడాది నవంబరు మాసంలో పెన్షన్ రాలేదని లబ్ధిదారులు గ్రామ పంచాయతీ ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత ఏడాది నవంబరు మాసంలో పెన్షన్లు రాలేదని, డిసెంబరు నుంచి పోస్టాఫీస్ ద్వారా పంపిణీ చేశారన్నారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా పోస్టాఫీస్‌లో ఇస్తరన్నారు. పోస్టాఫీస్ అధికారులను సంప్రదిస్తే తాము డిసెంబరు నుంచే ఇస్తున్నామని, నవంబరుకు సంబంధించింది పంచాయతీ కార్యదర్శే ఇస్తారని చెబుతున్నారన్నారు. ఈ విషయంపై మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు నవంబరు పెన్షన్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'కస్తూర్బా'ను సందర్శించిన నరేందర్‌రెడ్డి

చిలప్‌చేడ్: మండలంలోని చిట్కూల్ కస్తూర్బా పాఠశాలను మంగళవారం టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని తెలుసుకున్న ఆయన తక్షణమే దాన్ని బాగు చేయించి నీరు అందేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నారాగౌడ్, కస్తూర్బా సూపర్‌వైజర్ హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల భవనాన్ని సందర్శించిన అధికారులు

చిలప్‌చేడ్: మండలంలోని జగ్గంపేట గ్రామంలో నిర్మిస్తున్న మత్స్యకారుల భవనాన్ని డీఈఈ వేణుగోపాల్, ఏఈ ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో నాణ్యత, పనితీరును పరిశీలించి, సూచనలు చేశారు. ఈ భవనానికి మత్స్యకారుల సంఘం నుంచి 90శాతం, ఎమ్మెల్యే నిధుల నుంచి 10శాతం మొత్తం 10లక్షలతో నిర్మాణం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనంతరామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ కార్పొరేషన్'కు దరఖాస్తు గడువు పెంపు

నర్సాపూర్: ఎస్సీ కార్పొరేషన్‌లో స్వయం ఉపాధికి రుణాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే గడువు తేదిని ఈనెల 15 వరకు పొడగించినట్లు ఎంపీడీవో శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులైన యువతీ, యువకుల నుంచి స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణం పొందడానికి దరఖాస్తు చేసుకునే గడువు జూలై 31వరకు ఉండగా, దాన్ని ఆగస్టు 15వరకు పొడగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

గ్రామాల్లో రైతు సవరణ మేళా

శివ్వంపేట: మండలంలోని తిమ్మాపూర్, దొంతి, బిజ్జీపూర్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ రికార్డుల సవరణ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ మాట్లాడుతూ రెవెన్యూ సవరణలో భాగంగా రైతులు తమ పేరు, ఇంటి పేరు, విస్తీర్ణం తప్పులు తదితర సమస్యలను రికార్డుల్లో సవరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శివ్వంపేట మండలంలో ఈనెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు దుర్గయ్య, భిక్షపతి, శ్రీశైలం, నాగరాజు, అర్జున్, బాబు, తదితరులున్నారు.

వసతిగృహాల విద్యార్థులను సొంత బిడ్డలుగా చూడాలి

● వసతిగృహాల సలహా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి





వసతిగృహాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, దివంగత పీఏసీఎస్ చైర్మన్ భార్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

నర్సాపూర్: వసతిగృహాల విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా వార్డెన్లు భావించి వారికి సేవ చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వసతిగృహాల సలహా కమిటీ సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణిమురళీధర్‌యాదవ్, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీసీసీబీ వైస్‌చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డెన్లపై గురుతర బాధ్యత ఉందని వారు విద్యార్థులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారిని తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలోనే నర్సాపూర్ నియోజకవర్గం వసతిగృహాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. వసతిగృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతూ కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్య తలెత్తకుండా మిషన్‌భగీరథ ద్వారా ప్రతి హాస్టల్‌కు నీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం వసతిగృహాల విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి వసతిగృహంలో పూర్తిస్థాయిలో విద్యార్థుల ఉండేలా చూడాలన్నారు. వసతి గృహం విద్యార్థులకు వార్డెన్లే తల్లిదండ్రులని వారు తమ సొంత పిల్లలుగా చూసుకోవాలని సూచించారు. కొల్చారం జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సలహాకమిటీ సమావేశానికి సంక్షేమశాఖల ఇంజనీరింగ్ అధికారులు కూడా వచ్చే విధంగా చూడాలన్నారు. కొల్చారం రెసిడెన్షియల్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఉందన్నారు. కౌడిపల్లి ఎంపీపీ పద్మనర్సింహారెడ్డి మాట్లాడుతూ కౌడిపల్లి బాలికల వసతి గృహం వార్డెన్ నర్సాపూర్‌లోని బాలికల వసతిగృహానికి కూడా ఇన్‌చార్జిగా ఉండటంతో పూర్తిస్థాయిలో విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా పోతుందన్నారు. బాలికల వసతిగృహాలకు రెగ్యులర్ వార్డెన్లను వెంటనే నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, బీసీ సంక్షేమ అధికారి సుధాకర్, సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి వసంత, ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, పద్మనర్సింహారెడ్డి, కొల్చారం జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గంలోని వసతిగృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

నర్సాపూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన అయ్యంగారి సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.3.60లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌యాదవ్, డీసీసీబీ వైస్‌చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు వారి ఇంటికి స్వయంగా వెళ్లి సత్యనారాయణ భార్య లింగమ్మకు చెక్కును అందజేశారు. సత్యనారాయణ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులకు అయిన డబ్బులను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, హబీబ్‌ఖాన్, శేఖర్, తదితరులున్నారు.

దంపుయార్డులతోనే సంపూర్ణ పారిశుధ్యం

● డీపీవో హనూక్



భుజరంపేటలో వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీపీవో హనూక్

కౌడిపల్లి: గ్రామాల్లో డంపుయార్డులను ఏర్పాటు చేసుకుంటేనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యపడుతుందని డీపీవో హనూక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని భుజరంపేటలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్ అభియాన్ పథకానికి మండలంలో ఐదు గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తచెదారం వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డంప్‌యార్డులకు చెత్తను తరలించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని సంపూర్ణ పారిశుధ్యం దిశగా అందరు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ నాయికోటి కిష్టమ్మ, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎం అంజిరెడ్డి, వీఆర్‌వోలు సోమరాజు, మల్లేశం, కార్యదర్శులు శ్రీనివాస్, దివ్యపాల్, నాగరాజు, వెంకటేశం, గ్రామస్థులు లింగం, పాండరి, శ్రీనివాస్ ఉన్నారు.

'నాయీబ్రాహ్మణులు ఐకమత్యంగా ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

కొల్చారం: నాయీబ్రాహ్మణులు ఐక్యమత్యంగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయీబ్రాహ్మణ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం కొల్చారం మండలంలో నిర్వహించిన మండలస్థాయి నాయీబ్రాహ్మణ సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దర్గా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కంటే తెలంగాణ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు రూ.250 కోట్లు కేటాయించిందన్నారు. కుల వృత్తుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. నాయీబ్రాహ్మణులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, హెల్త్‌కార్డులు, 50 సంవత్సరాలు కలిగిన వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. కొంత మంది సంఘాల పేరిట నాయీబ్రాహ్మణులను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, వారిని తరిమికొట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్, సురేష్, రమేష్, యాదగిరితో పాటు జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత చతుర్విధ ప్రక్రియపై 60రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గిరిబాబు మాట్లాడుతూ 6, 7, 8 పిరియేడ్‌ల్లో 60రోజుల పాటు 15 గ్రూపులుగా 28, 30మంది చొప్పున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరై ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబయ్య, గంగాల రమేశ్, వేణుగోపాల్, వెంకటేశం, గోరేశంకర్, జగన్నాథం, చార్లెస్, మంజుల, నర్సాగౌడ్, జయశ్రీ, రమేశ్, ఎకే.పద్మా, శంకరయ్య ఉన్నారు.

ఫైలాన్‌ను బాగుచేస్తాం

• గడ ప్రత్యేక అధికారి హన్మంతరావు

తూప్రాన్: పట్టణంలో మంజీరా తాగునీటి పథకం ఫైలాన్‌ను వృథగా వదిలి వేయడంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మంజీరా' ఫైలాన్ వృథా' కథనంపై గడ ప్రత్యేక అధికారి హన్మంతరావు స్పందించారు. తూప్రాన్ పట్టణంలోని మంజీరా తాగునీటి పథకం ఫైలాన్‌ను బాగు చేస్తామని తెలిపారు.

కొప్పులపల్లిలో గొర్రెల పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

వెల్దుర్తి: మండలంలోని కొప్పులపల్లిలో మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన 73 గొర్రెలను లబ్ధిదారులకు జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య పంపిణీ చేశారు. గొల్ల కుర్మలను ఆదుకునేందుకు ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేయడం పట్ల వారికి ఎంతో ఉపాధి చూపినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వారి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి'

చేగుంట: ఎస్సీ కార్పొరేషన్ అందించే రుణాలకు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఈవోపీఆర్డీ ఉమాదేవి తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు జులై 31వరకే గడువు ఉండగా ప్రభుత్వం ఆగస్టు 15వరకు పొడిగించిందన ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ప్రొపార్మాతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

చెట్లతిమ్మాయిపల్లిలో ఈత మొక్కల పెంపకం

చేగుంట: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెట్లతిమ్మాయిపల్లిలో ఉపాధిహామీ ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. ఉపాధిహామీ ఏపీవో ఆదినారాయణ ఆధ్వర్యంలో కుంటలు, చెరువుల గట్లపై ఈత మొక్కలను నాటారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు గౌడ కులస్థుల అభివృద్ధికి ఈత మొక్కలను నాటుతున్నారని, అదేవిధంగా ఉపాధిహామీ ఆధ్వర్యంలో కూడా నాటుతున్నట్లు ఏపీవో తెలిపారు.

ముగిసిన మహంకాళి జాతర ఉత్సవాలు

వెల్దుర్తి: మండలంలోని మాసాయిపేటలో మూడు రోజులుగా జరుగుతున్న మహంకాళి జాతర బోనాల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ప్రతి ఏడు గ్రామ శివారులోని మహంకాళమ్మకు, కట్టమైసమ్మకు బోనాలు, గావురంగాలు, ఒడి బియ్యాల సమర్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. కాగా చివరి రోజు గ్రామ సమీపంలోని కట్టమైసమ్మకు బోనాల ఊరేగింపు ఎంతో కన్నులపండువగా జరిగింది. గ్రామ యువకులు కాళికమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయగా విద్యుత్ దీపాల అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

5న మండల సమావేశం

తూప్రాన్: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 5న ఉ.11గంటలకు నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ ఎంపీడీవో చెన్నమనేని శ్రీనివాస్‌రావు తెలిపారు. గౌరవ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నాయీబ్రాహ్మణ మండల కమిటీ నియామకం

వెల్దుర్తి: నాయీబ్రాహ్మణ మండల కమిటీ ఎన్నికలు మంగళవారం వెల్దుర్తిలోని విరబేశ్వర ఆలయంలో నిర్వహించారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పెంటయ్య, మండల కమిటీ అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షుడిగా నగేష్, శ్రీశైలం, జిందేష్, కోశాధికారిగా మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల నాయీబ్రాహ్మణులు పెంటయ్య, శ్రీను, నర్సింలు, భిక్షపతి, మహేష్‌తో పాటు సత్తయ్య పాల్గొన్నారు.

'పద్మశాలీ వివాహ వేదికను విజయవంతం చేయండి'

చేగుంట: మెదక్ జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఈనెల 15న నిర్వహించే ఉచిత వివాహ పరిచయ వేదికను విజయవంతం చేయాలని పద్మశాలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోన కుర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ముమ్మరంగా మిషన్‌భగీరథ పనులు







పైపులైన్ వేయడానికి తవ్విన గుంతలు, పైపులైన్ పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేష్
పైపులైన్లకు ఫెర్రోవాల్వ్‌ను అమర్చుతున్న కార్మికులు

చేగుంట: ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్‌భగీరథ పైపులైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని మూడు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో పైపులైన్ల పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. మేజర్ గ్రామ పంచాయతీ మండల కేంద్రమైన చేగుంటలో మూడు రోజులుగా పైపులైన్ల తవ్వకం పనులను ఎక్స్‌కవేటర్‌తో నిర్వహిస్తున్నారు. చేగుంటలోని ప్రధాన వీధుల్లో తవ్వకం పనులు జరుగుతున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్పటికీ స్వచ్ఛమైన తాగునీరు లభిస్తుండడంతో ఇబ్బందులను కూడా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఇంటిపన్ను రశీదు, ఆధార్ కార్డు అనుగుణంగా ఇంటింటికీ నల్లా కనెక్షన్ అందజేస్తున్నారు. చేగుంటలో మంగళవారం జరుగుతున్న పైపులైన్ పనులను మిషన్‌భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈవెంకటేష్, మెఘా ప్రతినిధులు పరిశీలించారు. ఆగస్టు 15నాటికల్లా ఇంటింటికీ గోదావరి నీటిని అందించనున్నట్లు డీఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీటి కష్టాలు ఆగస్టు 15తో తీరనున్నాయి.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

వెల్దుర్తి: లయన్స్‌క్లబ్ ఆఫ్ మెదక్ మంజీరా ఆధ్వర్యంలో జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెదక్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బండపోచాన్‌పల్లిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు 900 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 20వేల పుస్తకాలను అందజేశామని తెలిపారు. కాగా మండలంలోని కుకునూర్ గ్రామంలో తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోగా వారి పిల్లలు సంతోష్, శ్రావణిని దత్తత తీసుకొని చదివిస్తున్నామని గుర్తుచేశారు. జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో సుమారు రూ.2కోట్లతో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాకు చెందిన దివ్యాంగులకు, కృత్రిమ అవయవాలు, వినికిడి పరికరాలు పంపిణీ చేశామన్నారు. లయన్స్ క్లబ్ తరపున బండపోచాన్‌పల్లి పాఠశాలను దత్తత తీసుకున్నామన్నారు. హరితహారంలో వంద ట్రీగార్డులు, 8,9,10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఐ క్యాంపు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్న భోజనానికి 300 ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటకిషన్, న్యాయవాదులు రవీందర్, రాజేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాంకిషన్ పాల్గొన్నారు.



బండపోచాన్‌పల్లిలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి

నిరుద్యోగులకు జీఎంఆర్ ఉచిత శిక్షణ

• 4న టోల్‌ప్లాజా వద్ద ఇంటర్వ్యూ

తూప్రాన్: జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్దనున్న ఉచిత శిక్షణాలయం 'సెంటర్ ఫర్ ఎంపవర్మెంట్ అండ్ లైవ్లీహుడ్స్'లో వివిధ రకాల వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణను అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి జాన్ తెలిపారు. శిక్షణ పొందే యువత ఈనెల 4న ఉ.10 గంటలకు మండలంలోని అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద హాజరు కావాలన్నారు. ఇందుకు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, విద్యార్హత, నివాస, వయస్సు ధ్రువీకరణ, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఇందులో జేసీబీ ఆపరేటర్స్, రేఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్, ఆటోమొబైల్ అండ్ టూవీలర్ రిపేరింగ్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ మొదలగు వాటిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఉద్యోగం సాధించడానికి అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, నామూనా ఇంటర్వ్యూలపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 3నెలల పాటు నిర్వహించే శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు 18ఏళ్ల నిండి 8వ తరగతి, ఆపై చదివిన తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు జన్ పేర్కొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ

చేగుంట: మండల కేంద్రమైన చేగుంటలోని వాసవికన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో శివాలయ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. సరస్వతి క్షేత్ర నిర్మాత అష్టావధాని అష్టకాల నర్సింహశర్మ ఆధ్వర్యంలో శ్రావణమాసంలో మంగళవారం మంగళగౌరీ వ్రత దినంగా భావిస్తూ శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వైశ్యసంఘ నాయకులకు ఆలయ నమూనా చిత్ర పటాన్ని అందించారు. దీపావళి నాటికల్లా ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్యసంఘం అధ్యక్షుడు తొడుపునూరి నాగరాజు, హన్మయ్య, వీరేశం, బాలేశం, కూన రాములు, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు నిర్మించాలని వినతి

నార్సింగి(చేగుంట): మండల కేంద్రంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించాలని బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ కృష్ణవేణికి వినతి పత్రాన్ని అందజేశారు. నార్సింగి మండల కేంద్రానికి ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మించడంలో జాప్యం వహిస్తున్నారని, స్థల సేకరణ కూడా ఇంకా జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గుర్రాల మహంకాళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యపాల్‌రెడ్డి, మన్నె యాదగిరి, పరుశరాములు, శైలెందర్, నర్సింలు, నరేష్, సిద్ధిరాములు ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ బిల్లులు అందజేత

చేగుంట: మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెక్కులను మంగళవారం అందజేశారు. మండలంలోని పెద్దశివనూర్ గ్రామంలో సర్పంచ్ లంబాడి రాంచంద్రం, ఉపసర్పంచ్ గుడిసందుల రాంచందర్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న 15మందికి రూ.12 వేల చొప్పున చెక్కులను అందజేశారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మించుకోడానికి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బక్కప్ప, వార్డు సభ్యుడు అంజనేయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సన్మానం

చేగుంట: లయన్స్‌క్లబ్ చేగుంట ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లను మంగళవారం సన్మానించారు. చేగుంటలోని కృష్ణవేణి పాఠశాలలో ఇబ్రహీంపూర్‌కు చెందిన స్వామి, చిన్నశివనూర్‌కు చెందిన కృష్ణ అనే ఆటో డ్రైవర్లను సన్మానించారు. ప్రతినిత్యం విద్యార్థులు, మహిళలు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆటో డ్రైవర్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దాసోజి వీరబ్రహ్మం, లింగమూర్తి, రాంరెడ్డి, సర్గం సిద్ధిరాములు, భోగ రాజు, శ్రీనివాస్, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అప్పుడు రోడ్లపై అమ్మకాలు..

ఇప్పుడు షెడ్లలో విక్రయాలు

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నగరపంచాయతీ పరిధిలోని పాతూర్ చౌరస్తాలో రైతుల మార్కెట్
- ఆహ్లాదకర వాతావరణంలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు
- మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవే కారణం
- మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామంటున్న రైతులు



మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

గజ్వేల్‌అర్బన్: ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలను మొన్నటి వరకు రైతులు రోడ్డుపైనే అమ్ముకోవాల్సి వచ్చేది. రాజీవ్‌రహదారిపై వెళ్లే వారికి తాజా కూరగాయలను విక్రయిస్తూ ఉండేవారు. ప్రమాదకరంగా బతుకుపోరాటం సాగిస్తున్న చిరు రైతులపై రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పెద్ద మనసుతో కరుణ చూపారు. ఏడు నెలల క్రితం గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.29 లక్షలను విడుదల చేయించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నగరపంచాయతీ పరిధిలోని పాతూర్ చౌరస్తాలో మొదట షెడ్లు వేయిస్తే చాలనుకున్న అధికారులు అంత మేరకే ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కానీ షెడ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బందులు ఏర్పడతాయని గుర్తించిన మంత్రి ఎన్ని నిధులైనా ఫర్వాలేదని భావించారు. అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక చొరవతో షెడ్లతో పాటు మక్కకంకులు కాల్చడానికి, విక్రయించడానికి ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా తాగునీటికి ఆర్వో ప్లాంట్, చిన్నారుల కోసం ఆటవస్తువులు కల్పించారు. క్యాంటీన్‌కు ప్రత్యేక గది, మరుగుదొడ్లు, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. మహిళా రైతు కూరగాయలు విక్రయించే మైనపు బొమ్మతో విద్యుత్‌దీపాల మధ్య మార్కెట్ వెలిగిపోతుంది. దీనిని జూలై 26న ప్రారంభించారు.

నీడపట్టున ఉండి అమ్మకాలు

చిరు రైతులంతా కూరగాయాలను నీడపట్టున ఉండి అమ్ముకుంటున్నారు. ఎంతో ఆనందం మధ్య విక్రయాలు చేస్తున్నారు. గతంలో తాగునీటికి వారికి ఇబ్బందులు తలెత్తేవి. మరుగుదొడ్లు లేక ఇబ్బందులు కలిగేవి. కానీ ప్రస్తుతం అన్నింటినీ అందుబాటులోకి తీసుకువచ్చిన మంత్రి హరీశ్‌రావుకు జీవితాంతం రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు. అంతేకాకుండా గతంలో కంటే అధిక సంఖ్యలోనే వాహనదారులు మార్కెట్‌కు వస్తున్నారని వ్యాపారులుతెలిపారు.

సంతోషంగా ఉంది



గతంలో ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతూ మక్కకంకులు అమ్ముకునే వాళ్లం. రోడ్డుపై వాహనాలు వెళ్తూ, వస్తూ ఉంటే దుమ్ము మాపై పడేది. కానీ ఇప్పుడు నీడపట్టున, దుమ్ము లేకుండా విక్రయాలు చేపడుతున్నాం. ఎంతో సంతోషంగా ఉంది. అంతేకాకుండా మంత్రి హరీశ్‌రావు మార్కెట్ ప్రారంభించిన నాటి నుంచి వారం రోజుల్లో రెండు సార్లు మా సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ఇంత చొరవ తీసుకుంటున్న మంత్రికి, ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- కనకయ్య, రైతు

ఆందోళన నుంచి ఆనందంలోకి వచ్చినట్లుంది



రోడ్డుపై ఎప్పుడు ఏమవుతుందోనన్న ఆందోళన నుంచి ఆనందంలోకి వచ్చినట్లుంది. నీడపట్టునకు వచ్చి అన్ని సౌకర్యాల మధ్య విక్రయాలు చేసుకుంటున్నాం. మాకు భరోసా కల్పించి అన్ని సౌకర్యాలు కల్పించిన మంత్రి హరీశ్‌రావు వెంటే మేము ఉంటాం. ఇంత మంచి మంత్రి ఉండడం, మా గురించి ప్రత్యేకంగా ఆలోచించడం చాలా ఆనందకరం. మహిళలమంతా సంతోషంగా ఉన్నాం.

- పద్మ, మహిళా రైతు



వర్షాల్లేక చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో బీళ్లుగా మారిన పంట పొలాలు



చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో వాడిపోతున్న మొక్కజొన్న పైరు



దుబ్బాక వ్యవసాయ డివిజన్‌పరిధిలోని చందాపూర్‌లో ఎండిపోయిన రావులచెరువు



నీరు లేక బోసిపోయిన నర్సాపూర్ మండలం హన్మంతాపూర్ సమీపంలో చెరువు

ఈ సారి వర్షాకాలం ప్రారంభంలో వరుణుడు అందరినీ ఆనందపరిచాడు. వానలు మస్తుగా పడతాయన్నట్టు భరోసా ఇచ్చాడు. అన్నదాతలంతా సంతోషంతో సాగు ప్రారంభించారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. రైతుల ఆశలన్నింటినీ ఆవిరి చేస్తున్నాడు. కరువు విలయతాండవం చేస్తోంది. చెరువులు, బోర్లు ఎండిపోయాయి. పైర్లన్నీ వాడుముఖం పట్టాయి. కళావిహీనంగా దర్శనమిస్తోన్న తమపై కనికరం చూపమంటూ వేడుకుంటున్నాయి చెరువులు, కుంటలు. ఒక్కసారొచ్చి పలకరించిపో అన్నట్లుగా ప్రాథేయపడుతున్నాయి పైర్లు. ఇక అన్నదాతలంతా కళ్లలో నీరు దాచుకుని.. గుండెల్లో బాధను దిగమింగుకుని ఆశగా వరుణుడి రాక కోసం వేచిచూస్తున్నారు.

కరువు.. దరువు

- ఖరీఫ్‌కు కష్టాలు
- ప్రారంభంలో జోరుగా వర్షాలు
- అంతటా సాగు చేపట్టిన అన్నదాతలు
- తర్వాత ముఖం చాటేసిన వరుణుడు
- వేసవిని తలపిస్తున్న వాతావరణం
- పదిరోజులుగా జాడ లేని వర్షం
- ఎండిపోయిన చెరువులు, కుంటలు
- అడుగంటిన భూగర్భజలాలు
- వాడిపోతున్న వరి మొక్కజొన్న, పత్తి తదితర పైర్లు
- వర్షం కోసం రైతుల ఎదురు చూపు
- వాన రాకపోతే ఈ సారీ కష్టాలే

నర్సాపూర్: వర్షాకాలం మొదట్లో బాగా వర్షాలు పడటంతో గతంలో కంటే అధికంగా ఈ ఖరీఫ్‌లో సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. మండలంలో ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 5900 ఎకరాలు కాగా ఇప్పటికీ 3500 ఎకరాల వరకు సాగు చేశారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం 2600ఎకరాలు కాగా 2350 ఎకరాలు సాగు చేశారు. జూన్‌లో వర్షాలు తరుచు పడటంతో నర్సాపూర్ మండలంలో 187.7 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 182 మి.మీ నమోదైంది. దీంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు ప్రారంభించారు. జూలై వచ్చాక వరుణుడు రైతులతో ఆడుకుంటున్నాడు. జూలైలో 236.9మి.మీ వర్షం నమోదు కావాల్సి ఉండగా 215 మి.మీ మాత్రమే నమోదైంది. జూలై 20వ తేదీన కొద్దిపాటి వర్షం పడింది. ఇక ఆ తర్వాత నుంచి నర్సాపూర్ ప్రాంతంలో చుక్క వర్షం పడలేదు. ఇప్పటికీ మండలంలోని ఏ చెరువులోకి నీరు వచ్చిన దాఖలాలు లేవు. బోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. పైగా ప్రభుత్వం 24గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటంతో అవసరమున్నా లేకున్నా అదేపనిగా బోర్లు నడుస్తుండటంతో భూగర్భంలో ఉన్న కాస్త నీరు కూడా పూర్తిగా లేకుండా పోయే ప్రమాదముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వర్షాలపై ఆధారపడి వేసిన పంటలు ఇప్పటికే వాడిపోయే దశకు వచ్చాయి. మొక్కజొన్న పంట దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



దుబ్బాక వ్యవసాయ డివిజన్‌పరిధిలోని చందాపూర్‌లో వర్షాలు లేక ఎండిపోతున్న మొక్కజొన్నచేను

పంటలు ఎండిపోతున్నాయ్!

తొగుట: దుబ్బాక వ్యవసాయ డివిజన్ పరిధిలో సకాలంలో వర్షాలు కురియక భూగర్భజలాలు అడుగంటిపోయాయి. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న, పత్తి, వరి పంటలను కాపాడుకోవడం కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. దుబ్బాక వ్యవసాయ డివిజన్ పరిధిలోని దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, మండలాల్లో అధికారిక లెక్కల ప్రకారం సుమారు 7,520 హెక్టార్లలో వరి, 21,180 హెకార్లలో మొక్కజొన్న, 4880 హెక్టార్లకు పత్తి, 2 వేల హెక్టార్లలో కంది, కూరగాయల పంటలను రైతులు సాగుచేశారు. తొగుట మండలంలో 1890 హెక్టార్లలో వరి, 5200 హెక్టార్లలో మొక్కజొన్న, 1410 హెక్టార్లలో పత్తి, 350 హెకార్లలో కంది, కూరగాయల పంటలు సాగుచేశారు. ఈ సారి జూన్‌లో సగటున 110 మిల్లీ మీటర్ల వర్షపాతం కురియాల్సి ఉండగా 220 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. జులైలో 220 మిల్లి మీటర్ల వర్షపాతం కురియాల్సి ఉండగా కేవలం 139 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాకపోవడంతో రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వైపు ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో బోరుబావులలో నీరు అడుగంటి పోతుంది. ఇప్పటికే రైతులు వేసిన పంటలు 30 శాతం దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా. పది రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగితే 90 శాతానికి చేరినా ఆశ్చర్యపోనవసరం లేదు.



చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్‌లో నీరు లేక ఎండిపోయిన చెరువు



నర్సాపూర్‌లోని రామచంద్రాపూర్ చెరువులో కొద్దిపాటి నీరు



దుబ్బాక వ్యవసాయ డివిజన్‌పరిధిలోని పెటిగడ్డ కిష్టాపూర్‌లో ఎండిన మొక్కజొన్నచేను



చందాపూర్‌లో నీరులేక ఎండిపోయిన రావులచెరువు

ఎడారుల్లా మారిన చెరువులు, కుంటలు

చిలప్‌చెడ్: వర్షాకాలం మొదలై రెండు నెలలు పూర్తయినా అనుకున్న మేర వర్షాలు కురియకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతటా చెరువులన్నీ ఎడారుల్లా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం మేలో 28 మి.మీ వర్షం కురియాల్సి ఉండగా 4.4మి.మీ మాత్రమే కురిసింది. జూన్‌లో 228 మి.మీ టర్లకు 67.7 మి.మీ కురిసింది. జూలైలో 279మి.మీ కురియాల్సి ఉండగా, 142.6 మి.మీటర్లు మాత్రమే కురిసింది. దీంతో పంటలపై తీవ్ర వర్షాభావ ప్రభావం ఏర్పడింది.

ఎండిపోయిన చెరువులు, కుంటలు

వర్షాలు కురువని కారణంగా చెరువుల్లో, కుంటల్లో నీరు లేక బీటలు వారాయి. గతేడాది కురిసిన వర్షం నీరు ఎండకాలంలో కాస్తోకూస్తో ఉండగా వర్షాకాలంలో మాత్రం నీరు లేక చెరువులు బోసిపోతున్నాయి. ఇది వరకు కనీసం 30 నుంచి 50శాతం చెరువుల్లో నీరు ఉండేది కానీ ఈ ఏడాది పరిస్థితి దారుణంగా మారింది.

అడుగంటిన భూగర్భజలాలు

చెరువుల కింద పంటలు పండినా, పండకున్నా బోరుబావుల వద్ద తప్పకుండా పండుతాయన్న నమ్మకం రైతులకు ఉంది. కానీ ఈ ఏడాది భిన్నంగా మారింది. సరైన వర్షాలు లేనందున చాలా బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఐదు ఎకరాలు పండించే రైతు సైతం ఒక టిన్నర నుంచి రెండు ఎకరాలు సాగు చేస్తున్నాడు.

ఎండిపోతున్న పంటలు

మండల పరిధిలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేశారు. వర్షాలు లేక మొక్కజొన్న వాడిపోగా, వరిచేళ్లు బీటలు వారుతున్నాయి.

వర్షాల కోసం పూజలు

మండల పరిధిలోని గౌతాపూర్, సోమక్కపేట తదితర గ్రామాల్లోని ప్రజలు వర్షాలు కురువాలని పూజలు నిర్వహించారు. గౌతాపూర్‌లో కప్పను ఊరేగిస్తూ గడపగడపకు నిండు బిందెతో అభిషేకం చేస్తూ ఊరేగించారు. సోమక్కపేటలో శివుడు, గణపతి దేవుళ్లకు పాలాభిషేకం, జలాభిషేకాలు నిర్వహించారు. వర్షాలు కురవాలని రైతులు మొక్కని దేవుడు లేడు. మరి ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తాడో లేదో.

పెట్టుబడి వస్తదో రాదోనని భయం వేస్తుంది



నాకు భూమి సరిగ్గా లేన్నందున వేరే వాళ్ల బోరుబావి వద్ద బటాయికి తీసుకొని సాగు చేస్తున్నా. నాల్గు ఎకరాలు నాటు వేయాల్సి ఉండగా, రెండు ఎకరాలు మాత్రమే వేశాం. అయినప్పటికీ బోరు మరీ తక్కువ పోస్తుండటంతో వేసిన పంట కూడా పండుతదో లేదో అనుమానంగా ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా వస్తదో రాదో అని భయం వేస్తుంది.

- నర్సింలు, రైతు, జగ్గంపేట

వర్షాలు పడకపోతే తిండి కూడా కరువే



ఈ సారి వర్షాలు కురియకుంటే పంటలు పండక తిండి గింజలు కూడా కరువైటట్టే ఉంది. ఎందుకంటే చెరువు కింద కాకపోయినా బోర్ల దగ్గరైనా పండుతాయన్న నమ్మకం ఉండేది. వర్షాలు లేక ఆ బోర్లు కూడా సరిగ్గా పని చేయడం లేదు.

- శ్రీరాములు, రైతు , చిలప్‌చెడ్

వ్యవసాయ పనులే లేవు



వర్షాలు కురిసి ఉంటే పొలం పనులకు ఎవరైనా పిలిచే వారు. దీంతో చేతినిండా పని ఉండేది. వానలు పడకపోవడం వల్ల వ్యవసాయ పనులు ఎక్కువగా లేన్నందున ఇప్పుడు పనులు లేక ఖాళీగా ఉన్నాం. వర్షాలు పడితేనే మాకు పనులు దొరుకుతాయి.

- దుర్గదాస్, రైతు, జగ్గంపేట

50 శాతం కూడా నమోదు కాని వర్షం



ఈ ఖరీఫ్ సీజన్‌లో కురువాల్సిన వర్షంలో 50శాతం కూడా నమోదు కాలేదు. దాన్ని ద్వారా మండల పరిధిలో ఆశించిన సాగు విస్తీర్ణం లేదు. బోర్లపై ఆధార పడ్డ వారు కూడా తక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. ఇకపై వర్షాలు కురిస్తేనే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

- ఏవో రాజు

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : --------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: --------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: --------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : ---------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : --------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : ------------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: ---------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గధాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్‌లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
